Follow: @ANNTELUGU
13-07-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 168 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పార్లమెంట్ వర్షా కాల సమావేశాలకు రంగం సిద్ధం

### జులై 19న అఖిలపక్ష సమావేశం.

**ఢిల్లీ, మహా :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందు అయిన జులై 19న ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం తన శాసన ఎజెండాను రాజకీయ పార్టీలకు వివరించనుండగా, ప్రతిపక్షాలు సభలో లేవనెత్తబోయే ప్రధాన అంశాలను ప్రస్తావించే అవకాశం ఉంది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక బిల్లులు, విధాన నిర్ణయాలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చలు ఈ సమావేశాల్లో జరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈసారి సమావేశాలు రాజకీయంగా అత్యంత ఉత్కంఠభరితంగా మారనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. **మిగతా 2వ పేజీలో**

టాప్ న్యూస్

ఇండియాలోనే పవర్ ఫుల్ ఉమెన్‌గా నీతా అంబానీ

సామాజిక సేవ, సంస్థాగత నిర్మాణం, నాయకత్వానికి అరుదైన గుర్తింపు.



03

మధుమేహం ముప్పులో గోవా అగ్రస్థానం

దేశవ్యాప్తంగా ఆందోళనకర గణాంకాలు




02

మూడు కార్పొరేషన్లు మావే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు




03

# ఖానామెట్‌లో 100 కోట్ల భూదందా

## గాడి తప్పిన మున్సిపల్ శాఖ





02

- అవినీతి–అక్రమాల తాండవం
- రూ.100 కోట్ల భూమి కబ్జా... బాధ్యులెవరు?
- కబ్జా దారుల కబంధ హస్తాల్లో ప్రభుత్వ భూములు!
- అక్రమాలకు అడ్డుకట్ట వేయలేని అధికార యంత్రాంగం!
- నోటీసులతో కాలయాపన
- సిబ్బంది కొరత సాకుతో చేతులెత్తేసిన అధికారులు !
- ఖానామేట్ భూ దందాపై హైడ్రా కొరడా ఎప్పుడు?
- కబ్జాదారులపై క్రిమినల్ కేసులు ఎప్పుడు?
- ఖానామేట్‌పై రెవెన్యూ మంత్రి దృష్టి సారిస్తారా?
- కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సిందే!


శేరిలింగంపల్లి మండలం ఖానామేట్‌లో వెలుగుచూసిన రూ.100 కోట్లకు పైగా ధర పలికే సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంపై ఇప్పటివరకు సంబంధిత శాఖలు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ నిషిద్ధ ఆస్తుల జాబితాలో ఉన్న భూమిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న భారీ నిర్మాణాలపై గతంలో ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హైటెక్ సిటీ–కూకట్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో నిర్మాణ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతుండగా, వాటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం మౌనం వీడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం నోటీసుల జారీతోనే బాధ్యత ముగిసినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన హైడ్రా కూడా ఈ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ప్రకటించిన హైడ్రా ఖానామేట్ వ్యవహారంలో ఎందుకు మౌనం పాటిస్తోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- విజయవంతంగా పూర్తైన భుజం శస్త్రచికిత్స.

02



## మారువేషంలో వెళ్లిన మంత్రికి చేదు అనుభవం

- చిల్లర లేదని బస్సు దిగమన్న కండక్టర్
- సామాన్యుడిలా దిగిపోయిన రవాణా మంత్రి

02



2027 ఆగస్టు 15 నుంచి

## దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్

- సూరత్–బిలిమోరా మార్గంలో తొలి హైస్పీడ్ సర్వీస్
- హైదరాబాద్‌కు మూడు కొత్త కారిడార్లు.

02

# మిసైళ్ల తయారీలో ప్రైవేటు రంగానికి అవకాశం!



### అస్త్ర మార్క్-2 తయారీకి ప్రైవేటు సంస్థలకు అవకాశం

- త్వరలో ప్రతిపాదనలు కోరనున్న కేంద్రం
- టాటా, అదానీ, మహీంద్రా సహా దిగ్గజ సంస్థల మధ్య పోటీ అవకాశం
- 200 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- దేశీయ అవసరాలతో పాటు రక్షణ ఎగుమతుల పెంపుపై కేంద్రం దృష్టి

02




## రైతులు నీళ్లు అడిగితే రక్తం అడుగుతావా

- ఇగో పక్కన పెట్టి వెంటనే మోటార్లు ఆన్ చేయండి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

02

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు



అమెరికా స్థావరాలపై దాడులంటూ ఇరాన్ ప్రకటన.

హర్మూజ్ జలసంధి మూసివేత ప్రకటించిన ఐఆర్జీసీ.

02



# పార్లమెంట్ వర్షా కాల సమావేశాలకు రంగం సిద్ధం

( మొదటి పేజీ తరువాయి)

ఇటీవల పలు ప్రతిపక్ష పార్టీల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు పార్లమెంట్‌లో కొత్త సమీకరణాలకు దారితీయనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న మార్పులు, కొందరు ఎంపీల వైఖరిలో వచ్చిన పరిణామాలు, శివసేన వర్గాల మధ్య మారిన రాజకీయ సమీకరణాలు, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కొందరు నేతల నిర్ణయాలు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల బలాబలాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఎన్డీయే కూటమి మరింత బలపడిన నేపథ్యంలో ప్రభుత్వం ధైర్యంగా సమావేశాలకు సిద్ధమవుతోంది.

ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టే అంశాలపై ప్రతిపక్షాలు ఇప్పటికే వ్యూహరచన ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారాన్ని సభలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. అలాగే 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన పరిణామాలు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా సమావేశాల్లో తీవ్ర చర్చకు దారితీయవచ్చని భావిస్తున్నారు.ఈ సమావేశాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో కీలక అంశం 130వ రాజ్యాంగ సవరణ బిల్లు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ వరుసగా 30 రోజులపాటు న్యాయస్థాన కస్టడీలో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్వయంచాలకంగా తమ పదవులను కోల్పోయేలా ఈ బిల్లులో ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. ఈ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ జులై 17న తన నివేదికను ఆమోదించి పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో ఇప్పటికే తీవ్ర చర్చ కొనసాగుతోంది.కీలక బిల్లులు, రాజకీయ విమర్శలు, ప్రజా సమస్యలు, ప్రతిపక్షాల ఆందోళనలు, ప్రభుత్వ శాసన కార్యక్రమాలతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తీవ్ర ఉత్కంఠ నడుమ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార పక్షం తన విధానాలను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తుండగా, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. దీంతో దాదాపు మూడు వారాలపాటు పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేసే కేంద్ర బిందువుగా మారనున్నాయి.



# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**విజయవంతంగా పూర్తైన భుజం శస్త్రచికిత్స.**

ముంబయి, మహా: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ముంబయిలో పరామర్శించారు. కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, అక్కడికి వెళ్లిన చంద్రబాబు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న పవన్ కల్యాణ్, వైద్యుల సలహా మేరకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. సినిమా షూటింగ్‌ల సమయంలో తగిలిన పాత గాయాల ప్రభావంతో ఈ సమస్య తీవ్రతరం కావడంతో ఆపరేషన్ అవసరమైందని వైద్యులు తెలిపారు.ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచార సమయంలో కూడా తీవ్రమైన భుజం నొప్పిని భరిస్తూనే పవన్ కల్యాణ్ కూటమి తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమాలు పూర్తైన తర్వాత వైద్య పరీక్షలు చేయించుకోగా, శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు.

ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల బృందం సుమారు మూడున్నర గంటలపాటు సంక్లిష్ట శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.కాగా, ఇటీవలే సైనస్ సమస్యకు కూడా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. తాజా భుజం ఆపరేషన్ అనంతరం కొద్ది రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం.



# మారువేషంలో వెళ్లిన మంత్రికి చేదు అనుభవం

- **చిల్లర లేదని బస్సు దిగమన్న కండక్టర్.**
- **సామాన్యుడిలా దిగిపోయిన రవాణా మంత్రి.**

**బెంగళూరు,మహా :** సామాన్య ప్రయాణికులు ప్రభుత్వ బస్సుల్లో ఎదుర్కొనే ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్న ఉద్దేశంతో మారువేషంలో తనిఖీలకు వెళ్లిన కర్ణాటక రవాణా శాఖ మంత్రి బైరతి సురేష్‌కు ఊహించని అనుభవం ఎదురైంది. టికెట్ కోసం వంద రూపాయల నోటు ఇవ్వగా చిల్లర లేదని చెప్పిన కండక్టర్, సరిపడా చిల్లర ఇవ్వలేకపోతే బస్సు దిగిపోవాలని స్పష్టం చేయడంతో మంత్రి నిశ్శబ్దంగా బస్సు దిగి వెళ్లిపోయారు. ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. రాత్రి వేళల్లో బీఎంటీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సిబ్బంది వ్యవహారశైలి, సేవల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలనే ఉద్దేశంతో మంత్రి బైరతి సురేష్ ముఖానికి మాస్క్ ధరించి సాధారణ ప్రయాణికుడిలా బస్సు ఎక్కారు. హెబ్బాళ్ నుంచి నాగశెట్టిహళ్లి వరకు వెళ్లే బస్సులో ఆయన దాదాపు రెండు గంటల పాటు ప్రయాణిస్తూ వివిధ మార్గాల్లో పరిస్థితులను పరిశీలించారు.జయమహల్, టీవీ టవర్, ఆర్‌టీ నగర్, సీబీఐ రోడ్, హెబ్బాళ్, మాన్యతా టెక్ పార్క్, నాగవార, హెన్నూర్, హెన్నూర్ బండే, బైరతి బండే, గెద్దలహళ్లి ప్రాంతాల మీదుగా సాగిన తనిఖీల సందర్భంగా ఒక దశలో మంత్రి రెండు టికెట్లు కావాలని కోరుతూ వంద రూపాయల నోటును కండక్టర్‌కు అందించారు. అయితే ఖచ్చితమైన చిల్లర ఇవ్వాలని కండక్టర్ కోరగా, తన వద్ద ప్రస్తుతం చిల్లర లేదని మంత్రి చెప్పారు.

దాంతో కండక్టర్ తన వద్ద కూడా చిల్లర లేదని చెబుతూ టికెట్ బ్యాగ్‌ను చూపించాడు. చిల్లర ఇవ్వలేకపోతే బస్సులో ప్రయాణం సాధ్యం కాదని, వెంటనే దిగిపోవాలని స్పష్టం చేశాడు. ముఖానికి మాస్క్ ఉండటంతో తనతో మాట్లాడుతున్న వ్యక్తి రాష్ట్ర రవాణా శాఖ మంత్రే నన్న విషయం కండక్టర్‌కు తెలియలేదు.

ఈ పరిస్థితిలో కూడా మంత్రి తన అసలు గుర్తింపును బయటపెట్టకుండా పూర్తిగా సామాన్య ప్రయాణికుడిలా వ్యవహరించారు. అధికార హోదాను ప్రదర్శించకుండా కండక్టర్‌తో ఎలాంటి వాగ్వాదానికి దిగకుండా ప్రశాంతంగా బస్సు దిగి వెళ్లిపోయారు. అనంతరం తనిఖీలను కొనసాగిస్తూ ఇతర బస్సుల్లో కూడా ప్రయాణించి ప్రయాణికుల సమస్యలను పరిశీలించినట్లు సమాచారం.ఈ ఘటన వెలుగులోకి రావడంతో సామాజిక మాధ్యమాల్లో విస్తృత స్పందన వ్యక్తమవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి మంత్రి స్వయంగా మారువేషంలో క్షేత్రస్థాయికి వెళ్లడాన్ని పలువురు అభినందిస్తున్నారు. అదే సమయంలో చిల్లర సమస్య ఇప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుండడం, కొంతమంది కండక్టర్ల వ్యవహారశైలిపై కూడా చర్చ సాగుతోంది.

ప్రజా రవాణా సేవలను మరింత ప్రయాణికుల అనుకూలంగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు ఉపయోగపడతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి స్వయంగా ఎదుర్కొన్న ఈ అనుభవం బీఎంటీసీ సేవల్లో ఉన్న లోపాలపై దృష్టి సారించేలా చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఖానామెట్‌లో 100 కోట్ల భూదందా

**శ్రీనివాసరావు కొత్త, స్టేట్ బ్యూరో చీఫ్:**

రంగారెడ్డి జిల్లా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శేరిలింగంపల్లి మండలం, కూకట్పల్లి జోనల్ పరిధి ఖానామెట్‌లో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం రోజురోజుకూ మరింత వివాదాస్పదంగా మారుతోంది. అయినప్పటికీ సంబంధిత శాఖల నుంచి మాత్రం ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్లు 11/33, 11/34 లలోని నిషిద్ధ 22 (ఎ) జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిలో సుమారు 4 వేల చదరపు గజాలలో భారీ కమర్షియల్ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ యంత్రాంగాలు ఇప్పటికీ ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మున్సిపల్ శాఖ స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలోనే పనిచేస్తోంది. అలాంటి శాఖలోనే ఈ స్థాయి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే మిగతా శాఖల పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ప్రశ్నలు ప్రజల నుంచి బహిరంగంగానే వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలపై అధికారులు స్పందించకపోవడం వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హైటెక్ సిటీ సాక్షిగా... అది అక్రమమే**

హైటెక్ సిటీ నడిబొడ్డున, కూకట్పల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సామాన్య ప్రజలు చిన్న షెడ్డు వేసుకున్నా, రోడ్డు పక్కన చిన్న దుకాణం ఏర్పాటు చేసినా రాత్రికి రాత్రే పోలీసుల నడుమ భారీ బందోబస్తుతో కూల్చివేతలకు దిగే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు... వంద కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చట్టాలు సామాన్యులకేనా? లేక కోట్ల రూపాయల భూములను ఆక్రమించే వారికి వేరే నిబంధనలున్నాయా? అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో భారీ నిర్మాణాలు జరుగుతున్నా చూడనట్లు వ్యవహరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ఖానామెట్ భూ దందాపై హైడ్రా కొరడా ఝుళిపించేనా?**

చెరువులు, నాలాలు, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా... ఖానామెట్ ప్రభుత్వ భూమి వ్యవహారంలో ఎందుకు మౌనం పాటిస్తోందన్న ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. చట్టవిరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిర్మాణాలను నిలిపివేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఖానామెట్‌పై రెవెన్యూ మంత్రి, కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సిందే!**

రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22 ఎ (1) (బి ) కింద నిషేధిత ఆస్తుల జాబితా తయారీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం. 469/ల్యాండ్ అడ్మిన్ (II)/20202 (తేదీ: 01092025), సీసీఎల్ఏ రెఫరెన్సు నెంబర్: 1/3282276/2025 (తేదీ: 1109 2025) ఉత్తర్వుల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 15 112025న పంపిన అధికారిక జాబితాలో ఖానామెట్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 11/33, 11/34 లను ప్రభుత్వ భూములుగా స్పష్టం చేశారు. ఆ జాబితా ప్రకారం.. సర్వే నంబర్ 11/33 లోని 76,835 చదరపు గజాలు (15 ఎకరాల 35 గుంటలు), సర్వే నంబర్ 11/34 లోని 10,769 చదరపు గజాల ( 2 ఎకరాల 09 గుంటలు) భూమిని 'ఖరీజ్ ఖాతా-రాష్ట్ర ప్రభుత్వం'గా పేర్కొన్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ సంతకంతో సెక్షన్ 22(ఎ) నిషేధిత జాబితాలో చేర్చిన ఈ భూములపైనే.. ప్రస్తుతం యథేచ్ఛగా నిర్మాణాలు సాగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఖానామెట్ ప్రభుత్వ భూమి వ్యవహారంపై రెవెన్యూ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని స్థానిక ప్రజలు పుర ప్రముఖులు విజ్ఞప్తి చేస్తున్నారు. భూమి యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, కోర్టు కేసులు, సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికే ప్రజావాణి వేదికగా స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం ఆందోళన కలిగించే విషయం. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు, జిల్లా యంత్రాంగానికి ఆధారాలతో కూడిన వినతిపత్రాలు అందజేసినా ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో చెప్పుకోదగ్గ చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హైటెక్ సిటీ నడిబొడ్డునే వంద కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంటే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ, జిల్లా యంత్రాంగం, హైడ్రా సంయుక్తంగా రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు .















## నోటీసులతో కాలయాపన... కబ్జాలకు గ్రీన్ సిగ్నల్

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించి గతంలో పనిచేసిన రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా అక్రమ కట్టడాన్ని భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు జరిపారు. కానీ తిరిగి అదే ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై బహిరంగ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలి ప్రస్తుతం "మేము కొట్టినట్టు చేస్తాం... మీరు ఏడ్చినట్టు చేయండి" అన్న చందంగా మారిందని స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఒకవైపు నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతుండగా, మరోవైపు నిర్మాణదారులు ఏమాత్రం భయం లేకుండా యథావిధిగా పనులు కొనసాగిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదుల నేపథ్యంలో నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ, "సిబ్బంది అంతా సర్ ప్రోగ్రామ్‌లలో బిజీగా ఉన్నారు" అనే కారణంతో తదుపరి చర్యలను వాయిదా వేస్తున్నట్లు సమాచారం. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, కోర్టు వ్యవహారాలు వంటి కారణాలను చూపుతూ అక్రమ నిర్మాణాలపై నిర్ణయాత్మక చర్యలకు దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిర్మాణ కార్యకలాపాలు ఏమాత్రం ఆగకపోవడం గమనార్హం. కనీసం నిర్మాణ పనులను నిలిపివేయడం, ప్రాంగణాన్ని సీజ్ చేయడం, చట్టపరమైన తదుపరి చర్యలు చేపట్టడం వంటి అంశాల్లో అధికారులు చొరవ చూపకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అధికారులు నోటీసులు ఇచ్చామని చెబుతుంటే, మరోవైపు నిర్మాణదారులు యథేచ్ఛగా పనులు కొనసాగిస్తుండటంతో అధికారుల చర్యలు కేవలం కంటితుడుపు చర్యలుగానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారం మొత్తం చూస్తుంటే అధికారులు నోటీసుల జారీతోనే తమ బాధ్యత పూర్తయిందన్నట్లుగా వ్యవహరించడం వల్ల అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా ఊతమిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని లేనియెడల ఇదే పరిస్థితి కొనసాగితే అక్రమ నిర్మాణాలు

# మిస్సైళ్ల తయారీలో ప్రైవేటు రంగానికి అవకాశం!

*** అస్త్ర మార్క్-2 ఉత్పత్తికి ప్రతిపాదనలు కోరనున్న కేంద్రం?**

**ఢిల్లీ, మహా :** దేశ రక్షణ రంగంలో మరో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అత్యాధునిక క్షిపణుల తయారీలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దేశీయ అవసరాలతో పాటు రక్షణ ఎగుమతులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన అస్త్ర మార్క్ 2 గగనతల క్షిపణి తయారీ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశంపై రక్షణ శాఖ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఆసక్తి ఉన్న సంస్థల నుంచి త్వరలోనే ప్రతిపాదనలు ఆహ్వానించే అవకాశం ఉందని జాతీయ మీడియా పేర్కొంది.ఈ ప్రక్రియలో ఐసీఓఎమ్ఎమ్, అదానీ గ్రూప్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు పోటీలో నిలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రక్షణ తయారీ రంగంలో ఇప్పటికే అనుభవం ఉన్న ఈ సంస్థలు తమ ప్రతిపాదనలను సమర్పించే అవకాశం ఉందని సమాచారం. అస్త్ర మార్క్2 భారత్ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన దీర్ఘ శ్రేణి గగనతల క్షిపణి. గరిష్ఠంగా 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు విమానాలు, ఇతర గగనతల లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల సామర్థ్యం దీనికి ఉంది. చైనాకు చెందిన పీఎల్15ఈ దీర్ఘ శ్రేణి ఎయిర్‌టుఎయిర్ క్షిపణికి పోటీగా దీనిని అభివృద్ధి చేశారు.

ఈ క్షిపణిని తెజస్ మార్క్ 1ఏ, మిగ్29, సుఖోయ్30 ఎమ్‌కేఐ, రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించేలా రూపొందించారు. భారత వైమానిక దళం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో అస్త్ర మార్క్ 2 కీలక పాత్ర పోషించనుంది.ఇటీవల ఇండోనేషియా అస్త్ర క్షిపణుల కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఏర్పడినట్లు భావిస్తున్నారు. దేశీయ అవసరాలతో పాటు ఎగుమతి ఆర్డర్లను కూడా సకాలంలో పూర్తి చేయాలంటే ప్రైవేటు రంగం భాగస్వామ్యం అవసరమని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఇదే సమయంలో స్వదేశీంగా అభివృద్ధి చేసిన 'ప్రళయ్' బాలిస్టిక్ క్షిపణి తయారీ బాధ్యతలను కూడా దశలవారీగా ప్రైవేటు రంగానికి అప్పగించే అంశంపై కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం విమానాలు, డ్రోన్లు, ఆర్టిలరీ వ్యవస్థలు, యుద్ధ నౌకల తయారీలో ప్రైవేటు రంగం భాగస్వామ్యం పెరుగుతుండగా, క్షిపణుల తయారీలోనూ ప్రైవేటు రంగ ప్రవేశం భారత రక్షణ పరిశ్రమలో కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్–బీఆర్ఎస్‌లు

**కేంద్ర మంత్రి బండి సంజయ్.**

**హైదరాబాద్, మహా.:** ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఒక పార్టీ తప్పు చేస్తే మరో పార్టీ దానిని సరిదిద్దకుండా రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతోందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు ఈ రెండు పార్టీలు కలిసి "రక్తకన్నీరు-2" సినిమా చూపిస్తున్నాయంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యంగా నిర్వహించి లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నీళ్ల పాల్జేసిందని బండి సంజయ్ ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోకుండా ప్రాజెక్టును కోమాలోకి నెట్టిందని విమర్శించారు. ఈ రెండు పార్టీల పాపాలకు తెలంగాణ రైతులే బలవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# టీవీకేతో పొత్తుపై డీఎంకే ససేమిరా

**కాంగ్రెస్ వైఖరిపై ఆగ్రహం**

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. అధికార ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే), కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాల మధ్య టీవీకేతో పొత్తు అంశం చర్చకు దారితీయడంతో ఇండియా కూటమిలో విభేదాలు బహిర్గతమవుతున్నాయి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో చేతులు కలపాలన్న ప్రతిపాదనకు డీఎంకే స్పష్టంగా వ్యతిరేకత వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సానుకూలంగా స్పందించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు జాతీయ స్థాయిలో మాత్రం ఇండియా కూటమిలో కలిసి పనిచేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ మద్దతు తెలిపినప్పటికీ, డీఎంకే మాత్రం టీవీకేతో ఎలాంటి పొత్తుకు సిద్ధంగా లేదని స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో డీఎంకే ఎంపీ గణపతి పి. రాజ్‌కుమార్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొమ్మిదేళ్లుగా తమతో కలిసి ప్రయాణించిన కాంగ్రెస్ ఇప్పుడు టీవీకేకు మద్దతు ఇవ్వడం వెన్నుపోటుతో సమానమని ఆరోపించారు. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను దూరం చేసుకుందని, ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా ఉపయోగించి మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.కేరళ, పశ్చిమ బెంగాల్‌లో అమలైన రాజకీయ సమీకరణాలు తమిళనాడులో పనిచేయవని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీవీకే మూడో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగిందని, దీనివల్ల రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ప్రస్తుతం ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగస్వామిగా పరిగణించాలా అనే అంశంపై విస్తృత స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలను బలహీనపర్చడమే బీజేపీ లక్ష్యమని, సిద్ధాంతపరంగా బీజేపీయే డీఎంకేకు ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగుతుందని చెప్పారు.డీఎంకేకాంగ్రెస్ మధ్య ఇటీవల ఏర్పడిన విభేదాలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదని, ఇరు పార్టీల మధ్య మునుపటి స్థాయి విశ్వాసం పునరుద్ధరించడానికి కొంత సమయం పట్టే అవకాశముందని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం డీఎంకేకే కాకుండా ఇండియా కూటమి ఐక్యతపైనా ప్రభావం చూపే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.



## ఆన్లైన్ మోసాలు, మైనర్ డ్రైవింగ్ పట్ల ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలి

**జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు**

**కుషాయిగూడ, మహా :** సమాజంలో జరుగుతున్న ఆన్లైన్ మోసాలు సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు పిలుపునిచ్చారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ సైదులు ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఆదివారం డిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఏఆర్ సిబ్బందితో కలిసి జవహర్ నగర్ లోని రిజిస్ట్రేషన్ కాలనీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో మూడు గంజాయి హాట్స్పాట్లను గుర్తించినట్లు, తనిఖీల్లో భాగంగా మూడు వాహనాలను అదుపులోకి తీసుకున్నామని ఒక బుజింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరము వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలలో అత్యంత జాగ్రత్త అవసరమన్నారు .మైనర్లకు తమ వాహనాలను ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని తెలిపారు. సమాజంలో డ్రగ్స్ సంస్కృతి విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. కాలనీలో భద్రతా పరమైన చర్యల కోసం కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అదుపులోకి తీసుకొని రావచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నీళ్లు అడిగితే రక్తం అడుగుతావా

- ఇగో పక్కన పెట్టి వెంటనే మోటార్లు ఆన్ చేయండి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**హైదరాబాద్ , మహా :** సాగునీరు అడిగిన రైతులపై ప్రతిపక్షాల రక్తం చల్లాలని మాట్లాడటం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రైతులకు నీళ్లు ఇవ్వకుండా పట్టిసీమకు నీటిని వదిలి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తోందని ఆరోపించారు. తెలంగాణ భవన్లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఒక బాధ్యతాయుత నాయకుడివిగా కాకుండా శాడిస్టుగా ఉన్నాయని తీవ్ర విమర్శలు చేశారు. రైతులు నీళ్లు అడిగితే రాయి కట్టుకుని దూకాలని, బెల్టుతో కొట్టాలని మాట్లాడటం అత్యంత బాధాకరమని అన్నారు. గోదావరిలో నీళ్లు లేవని ప్రభుత్వం ప్రచారం చేయగా, కేటీఆర్ ప్రత్యక్ష ప్రసారంలో గోదావరిలో ప్రవహిస్తున్న నీటిని చూపించడంతో ప్రభుత్వం మాట మార్చిందని ఎద్దేవా చేశారు.

కన్నెపల్లి పంప్హౌస్ మోటార్లు 93.5 మీటర్ల నీటిమట్టం వద్ద పనిచేస్తాయని, ప్రస్తుతం గోదావరిలో నీటిమట్టం 97.5 మీటర్లకు చేరడంతో గేట్లు మూయాల్సిన అవసరం లేకుండానే మోటార్లు నడపవచ్చని హరీశ్ రావు తెలిపారు. లక్ష క్యూసెక్కుల వరద ప్రవహిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని ఎత్తిపోసేందుకు ఎలాంటి సాంకేతిక అడ్డంకి లేదని, ఈ విషయంలో సీఎం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దుష్ప్రచారమేనని ఆయన పేర్కొన్నారు. కేవలం రూ.8.5 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీటిని ఎల్లంపల్లికి తరలించవచ్చని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికే సూచించినప్పటికీ, గతంలో చేసిన విమర్శలు తప్పని తేలిపోతాయనే భయంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదని విమర్శించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసిందన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను హరీశ్ రావు ఖండించారు. 2004లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగినప్పటి నుంచి 2014 వరకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయలేకపోయారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు పూర్తి చేసి అదనపు నిధులు వెచ్చించి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చిందని వివరించారు.

ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ మినహా చాలా తక్కువ నీరు మాత్రమే ఉందని, ఎన్టీపీసీ, సింగరేణి, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు భారీగా నీరు అవసరమవుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా నీటిని ఎత్తకపోతే భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి దెబ్బతిని రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్న సీఎం వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టుల ద్వారా 48.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. మహబూబ్నగర్ జిల్లాలో కూడా కాంగ్రెస్ పాలనలో 46 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందగా, బీఆర్ఎస్ హయాంలో 6.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని చెప్పారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 2 కోట్ల 60 లక్షల టన్నులకు పెరగడం కేసీఆర్ ప్రభుత్వ వ్యవసాయ విధానాల ఫలితమేనని పేర్కొన్నారు.అన్నారం, సుందిల్ల బ్యారేజీల్లో నీరు నిల్వ చేస్తే భద్రాచలం మునిగిపోతుందన్న ప్రభుత్వ వాదనను కూడా హరీశ్ రావు కొట్టిపారేశారు. 2022లో భారీ వరదల సమయంలో కూడా భద్రాచలం పరిస్థితి అదుపులోనే ఉందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయలు అవినీతి జరిగిందన్న ఆరోపణలు కూడా అవాస్తవమని, మొత్తం ఖర్చు సుమారు రూ.87 వేల కోట్లేనని చెప్పారు. మేడిగడ్డఎల్లంపల్లి మధ్య భాగమే సమస్యకు గురైందని, మిగిలిన వ్యవస్థ సురక్షితంగానే ఉందని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అందుబాటులో ఉన్న ప్రతి చుక్క నీటిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని హరీశ్ రావు అన్నారు. కన్నెపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా వెంటనే నీటిని ఎత్తాలని డిమాండ్ చేశారు. దేవాదులలో పది మోటార్లకు బదులుగా నాలుగు మాత్రమే నడుపుతున్నారని, వరంగల్, ధర్మసాగర్, పాలకుర్తి ప్రాంతాల్లో చెరువులు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను విస్మరించి పట్టిసీమకు నీటిని వదులుతూ చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం తనపై కేసులు పెట్టినా, జైలుకు పంపినా తాను సిద్ధమేనని, కానీ రైతుల పంటలను ఎండబెట్టే నిర్ణయాలను మాత్రం తెలంగాణ ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వెంటనే ఈగోలు, రాజకీయ పంతాలు పక్కనపెట్టి కన్నెపల్లి, దేవాదుల మోటార్లను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## 2027 ఆగస్టు 15 నుంచి దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్

**, మహా :** భారత రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ సేవలను 2027 ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్లో భాగంగా సూరత్-బిలిమోరా మధ్య తొలి సర్వీసును అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలి హైస్పీడ్ రైలు మార్గంగా ఈ సెక్షన్ నిలవనుందని తెలిపారు. మొత్తం 508 కిలోమీటర్ల పొడవున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ను దశలవారీగా ప్రారంభించనున్నట్లు మంత్రి వివరించారు. తొలి దశలో సూరత్-బిలిమోరా మార్గం అందుబాటులోకి రానుండగా, అనంతరం వాపి-సూరత్, వాపి-అహ్మదాబాద్, థానే-అహ్మదాబాద్ మార్గాలను వరుసగా ప్రారంభించి, చివరగా పూర్తి స్థాయిలో ముంబై-అహ్మదాబాద్ కారిడార్ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు.

జపాన్ షింకాన్సెన్ సాంకేతికత ఆధారంగా రూపొందుతున్న ఈ హైస్పీడ్ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనుంది. పూర్తి కారిడార్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ముంబై-అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుండటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి కూడా ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైలు నెట్వర్క్ విస్తరణ ప్రణాళికలను కూడా అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. హైదరాబాద్ను కేంద్రంగా చేసుకుని పుణె-హైదరాబాద్, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు అనే మూడు కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అదనంగా హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు అనుసంధానం పైనా ప్రణాళికలు రూపొందుతున్నాయని చెప్పారు. ఈ కారిడార్లు దక్షిణాది రాష్ట్రాల మధ్య వేగవంతమైన రైలు అనుసంధానానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో హైదరాబాద్కు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు కేటాయించబడినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణలోని పలు ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తూ రాష్ట్ర రవాణా వ్యవస్థలో కీలక మార్పులకు దారితీస్తాయని చెప్పారు. అదేవిధంగా, 'నవ్ నిర్మాణ్' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 261 రైల్వే స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణలో సికింద్రాబాద్, బేగంపేట్, హైటెక్ సిటీ వంటి కీలక రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

# తెలంగాణ రక్షణ సేనకు గుర్తింపు ఇవ్వాలి

- అభ్యంతరాల కాపీలు ఇవ్వకుండా సమాధానం ఎలా చెబుతాం? ఈసీని ప్రశ్నించిన కల్వకుంట్ల కవిత.



**హైదరాబాద్, మహా. :** తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపు మంజూరు చేయాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ఎన్నికల కమిషన్ను కోరారు. ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్కు సమగ్ర వివరణను సమర్పించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఆదివారం ప్రధాన ఎన్నికల కమిషనర్తో పాటు ఎన్నికల కమిషనర్లకు లేఖ పంపి, పార్టీ పేరుకు సంబంధించిన అభ్యంతరాలపై తమ వాదనలను వివరించారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ ఏడాది ఏప్రిల్ 28న పంపిన లేఖ ద్వారా "తెలంగాణ రక్షణ సేన" పేరును తమకు కేటాయించినట్లు తెలియజేసిందని లేఖలో పేర్కొన్నారు. ఆ అనుమతిని ఆధారంగా చేసుకుని తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాల ఆవిష్కరణ, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం జూన్ 23న కమిషన్ నుంచి మరో లేఖ అందిందని, పార్టీ రిజిస్ట్రేషన్పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని అందులో పేర్కొన్నారని వివరించారు.

అయితే ఇప్పటివరకు ఆ అభ్యంతరాల కాపీలను తమకు అందజేయలేదని పార్టీ పేర్కొంది. అభ్యంతరాలు ఎవరు దాఖలు చేశారు, వాటిలో ఏమి పేర్కొన్నారు, ఏ ఆధారాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారనే వివరాలు ఇవ్వకుండా తమ నుంచి సమాధానం కోరడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడింది. అభ్యంతరాల వివరాలే తెలియకపోతే సమర్థవంతమైన వివరణ ఎలా ఇవ్వగలమని ప్రశ్నించింది.

రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లకు పైగా ఉండగా వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే కారణంతో పార్టీ పేరును తిరస్కరించడం సరైన విధానం కాదని లేఖలో పేర్కొన్నారు. కేవలం అభ్యంతరాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవడం కాకుండా వాటి చట్టపరమైన బలం, వాస్తవికత, ఉద్దేశాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఎవరైనా ప్రణాళికాబద్ధంగా సమూహాలుగా ఏర్పడి అభ్యంతరాలు దాఖలు చేశారా అనే అంశం కూడా అభ్యంతరాల కాపీలు అందిన తర్వాతే స్పష్టమవుతుందని పేర్కొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదించిన పేరును విశ్వసించి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు అదే పేరును మార్చుకోవాలని సూచించడం వల్ల పార్టీకి తీవ్ర నష్టం, అన్యాయం జరుగుతుందని కవిత వాదించారు. ఢిల్లీ హైకోర్టు సూచించినట్లుగా వ్యక్తిగత విచారణకు హాజరయ్యే ముందు తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, వాటికి సంబంధించిన ఆధారాలను అందించాలని కోరారు. పూర్తి వివరాలు అందిన తర్వాతే తమ వాదనలను సమగ్రంగా వినిపించే అవకాశం ఉంటుందని తెలిపారు.

"తెలంగాణ రక్షణ సేన" అనే పేరును పూర్తిగా స్వతంత్రంగా, సదుద్దేశంతో ఎంపిక చేశామని లేఖలో వివరించారు. ఈ పేరుతో దేశంలో మరే రాజకీయ పార్టీ నమోదు కాలేదని, గుర్తింపు పొందిన లేదా నమోదైన ఏ పార్టీ పేరును కూడా ఇది పోలి ఉండదని పేర్కొన్నారు. పార్టీ పేర్లను పరిశీలించే సమయంలో మొత్తం పేరును ఒక సమగ్ర రూపంగా చూడాలే తప్ప అందులోని విడి పదాలను వేరు చేసి పోలికలు వెతకడం సరికాదని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల కమిషన్ ప్రస్తావించిన "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్)" మరియు "తెలంగాణ రాజ్య సమితి" వంటి పేర్లు తమ పార్టీ పేరుతో పూర్తిగా భిన్నమైనవేనని పేర్కొన్నారు. ఉచ్చారణ, నిర్మాణం, నాయకత్వం, రాజకీయ గుర్తింపు, ప్రజల్లో ఉన్న అవగాహన పరంగా కూడా ఈ పేర్లకు స్పష్టమైన తేడా ఉందని వివరించారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీతోనూ తమ పార్టీ పేరుకు గందరగోళం ఏర్పడే అవకాశం లేదని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా ఒకే విధమైన భౌగోళిక, సిద్ధాంతపరమైన లేదా సాధారణ పదాలతో వందలాది రాజకీయ పార్టీలు నమోదై ఉన్నాయని లేఖలో గుర్తుచేశారు. ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా, డెమోక్రాటిక్, సోషల్, రిపబ్లిక్ ఇండియా, శిరోమణి వంటి పదాలతో అనేక పార్టీలు ఎన్నికల కమిషన్ వద్ద నమోదు పొందిన ఉదాహరణలను జతచేసినట్లు పేర్కొన్నారు. కేవలం కొన్ని సాధారణ పదాల సారూప్యత ఆధారంగా పార్టీ పేరును తిరస్కరించడం చట్టపరంగా సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలతో పాటు వాటికి ఆధారంగా ఉపయోగించనున్న ప్రతి పత్రాన్ని తమకు అందజేయాలని తెలంగాణ రక్షణ సేన కోరింది. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర సమాధానం ఇచ్చేందుకు తగిన సమయం కల్పించిన తర్వాతే వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేసింది. కేవలం ఊహాజనిత సంక్షిప్త రూపాలు లేదా సాధారణ భౌగోళిక పదాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలను తిరస్కరించాలని కోరుతూ, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం "తెలంగాణ రక్షణ సేన" పార్టీ నమోదుకు తమ దరఖాస్తును పరిశీలించి ఆమోదించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ను విజ్ఞప్తి చేసింది.

## మూడు కార్పొరేషన్ లు మావే

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, మహా :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో హైదరాబాద్, మల్కాజ్గిరి, సైబరాబాద్ మూడు కార్పొరేషన్లపై బిజెపి జెండా ఎగరడం ఖాయమని, ఈ మూడింటిలోనూ బిజెపి మేయర్లే పీఠాన్ని అధిరోహిస్తారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని, జీహెచ్ఎంసీ ఘోరంగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ఆదివారం కూకట్పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని వివేకానంద కాలనీలో బిజెపి నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పూర్వం మున్సిపల్ చైర్మన్గా పనిచేసిన హన్మంతరావు పార్టీ కోసం విరాళంగా ఇచ్చిన స్థలంలోనే ఈ నూతన కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి, కూకట్పల్లి నియోజకవర్గాల్లో పార్టీ పెద్దఎత్తున విజయం సాధించడానికి ఈ కార్యాలయమే ప్రధాన వ్యూహ కేంద్రంగా పనిచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజలంతా బిజెపి వైపు ఆశగా చూస్తున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హైదరాబాద్, మల్కాజ్గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని, ఈ మూడు చోట్లా బిజెపి మేయర్లే పీఠాన్ని అధిరోహిస్తారని స్పష్టం చేశారు.మరోవైపు హైదరాబాద్ నగరంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశాయని మండిపడ్డారు. నగరంలో ఇప్పటికే తీవ్ర నీటి ఎద్దడి ఉందని, వర్షాకాలం వచ్చేలోపు వరద ముంపు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని బిజెపి మొదటి నుంచి హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 'ఎల్ నినో' ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, పడిన చిన్నపాటి వానలకే నగరం జలమయమై ట్రాఫిక్ స్తంభిస్తోందని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ఎంఐఎంతో దోస్తీ చేస్తూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయే తప్ప, నగరాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. అందుకే విసిగిపోయిన నగర ప్రజలు ఈసారి బిజెపికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

### ఇండియాలోనే పవర్ ఫుల్ ఉమెన్ గా

# నీతా అంబానీ

**'సామాజిక సేవ, సంస్థాగత నిర్మాణం, నాయకత్వానికి అరుదైన గుర్తింపు.**



**ముంబై, మహా.** ఫార్చ్యూన్ ఇండియా విడుదల చేసిన మోస్ట్ పవర్ఫుల్ ఉమెన్-2026 జాబితాలో రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఛైర్పర్సన్ నీతా అంబానీ తొలి స్థానాన్ని దక్కించుకున్నారు. దూరదృష్టితో కూడిన నాయకత్వం, సంస్థాగత నిర్మాణం, సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సేవల్లో ఆమె చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రదానం చేసినట్లు ఫార్చ్యూన్ ఇండియా వెల్లడించింది.

ఈ ఏడాది జాబితాలో హెచ్సీఎల్ టెక్నాలజీస్ ఛైర్పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా రెండో స్థానంలో నిలవగా, అపోలో హాస్పిటల్స్కు చెందిన రెడ్డి సిస్టర్స్ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. జూమ్ వీడియో కమ్యూనికేషన్స్ ప్రధాన నిర్వహణాధికారి అపర్ణ బావా నాలుగో స్థానంలో, ప్రపంచ బ్యాంకు గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన ఆర్థిక అధికారి అంషులా కాంత్ ఐదో స్థానంలో నిలిచి భారత మహిళా నాయకత్వానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.

రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, క్రీడలు, విపత్తు సహాయ కార్యక్రమాల్లో నీతా అంబానీ నాయకత్వం కీలక పాత్ర పోషించింది. దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా ప్రజలకు, అందులో కోట్లాది మంది పిల్లలకు ఫౌండేషన్ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం చేకూరినట్లు ఫార్చ్యూన్ ఇండియా పేర్కొంది.

ఫార్చ్యూన్ ఇండియా ఈ జాబితాను కేవలం వ్యాపార విజయాల ఆధారంగానే కాకుండా, సంస్థలపై చూపిన ప్రభావం, నాయకత్వ సామర్థ్యం, ఆర్థిక వ్యవస్థకు చేసిన సేవలు, నవీన ఆలోచనలు, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధిలో పోషించిన పాత్ర వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందిస్తుంది. ఈ జాబితాలో స్థానం పొందడం భారత కార్పొరేట్ రంగంలో అత్యున్నత గుర్తింపులలో ఒకటిగా భావిస్తారు.ఈ గుర్తింపు ద్వారా భారత మహిళలు ప్రపంచ వ్యాపార, ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య రంగాల్లో మరింత ప్రభావవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని మరోసారి స్పష్టమైంది. భారత ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర నిరంతరం పెరుగుతోందనే విషయాన్ని ఈ జాబితా ప్రతిబింబిస్తోందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### మధుమేహం ముప్పులో

# గోవా అగ్రస్థానం

**దేశవ్యాప్తంగా ఆందోళనకర గణాంకాలు**




**ఢిల్లీ, మహా.** దేశంలో మధుమేహం వ్యాప్తి ఆందోళనకర స్థాయికి చేరుకుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా పరిశీలించిన గణాంకాల్లో గోవా అత్యధికంగా 26.4 శాతం మధుమేహ బాధితులతో మొదటి స్థానంలో నిలవగా, పుదుచ్చేరి 26.3 శాతం, కేరళ 25.5 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్లో కేవలం 4.8 శాతం మాత్రమే నమోదవడంతో అత్యల్ప మధుమేహ ప్రాబల్యం ఉన్న రాష్ట్రంగా గుర్తింపు పొందింది.

గణాంకాల ప్రకారం గోవా తర్వాత పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మధుమేహం అధికంగా నమోదైంది. తమిళనాడు 14.4 శాతం, పశ్చిమ బెంగాల్ 13.7 శాతం, సిక్కిం 12.8 శాతం, పంజాబ్ 12.7 శాతం, హర్యానా 12.4 శాతంతో మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. ఈ గణాంకాలు దేశంలో జీవనశైలి సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

నిపుణుల అభిప్రాయం ప్రకారం అధిక కేలరీల ఆహారం, శారీరక శ్రమ తగ్గడం, ఊబకాయం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి అంశాలు మధుమేహం పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోందని వారు చెబుతున్నారు.

మధుమేహం ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది ఆలస్యంగా గుర్తిస్తున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తరచూ దాహం వేయడం, మూత్ర విసర్జన పెరగడం, అలసట, బరువు తగ్గడం, చూపు మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రజలు సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, శరీర బరువును నియంత్రణలో ఉంచడం, కాలానుగుణంగా రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మధుమేహం బారిన పడే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వారు పేర్కొంటున్నారు.

## కాళేశ్వరం పునరుద్ధరణలో కాంగ్రెస్ సర్కారు విఫలం

**సీఎం రేవంత్కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్రావు బహిరంగ లేఖ**

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలో నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ ఇచ్చిన సిఫార్సులను రెండున్నరేళ్లుగా అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోలేదని రామచందర్రావు లేఖలో పేర్కొన్నారు. బ్యారేజీల దెబ్బతినడానికి గత ప్రభుత్వ వైఫల్యాలు కారణమైనప్పటికీ, వాటి మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎన్డీఎస్ఏ ఇప్పటికే పలుమార్లు నివేదికలు ఇచ్చినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. బ్యారేజీల ఆరోగ్య పరీక్షలు, భూభౌతిక అధ్యయనాలు, నిర్మాణ భద్రతా పరీక్షలు, హైడ్రాలిక్ పరిశీలనలు, పగుళ్ల మ్యాపింగ్, ఇతర సాంకేతిక పరీక్షలు ఒకటి నుంచి రెండు పని సీజన్లలో పూర్తి చేయవచ్చని ఎన్డీఎస్ఏ సూచించినప్పటికీ ప్రభుత్వం మూడు సీజన్లు గడిచినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ కారణంగా గోదావరి జలాల్లో సుమారు 200 టీఎంసీల వినియోగం నిలిచిపోయిందని, కరవు పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం పునరుద్ధరణ కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ కేవలం సాంకేతిక మార్గదర్శకత్వం మాత్రమే ఇస్తుందని, అసలు బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదేనని రామచందర్రావు తెలిపారు. కమిటీపై బాధ్యత నెట్టివేస్తూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద గేట్లు తెరిచి ఉంచినా కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ త్వరగా పూర్తయి ఉంటే ఉత్తర తెలంగాణలో 20 నుంచి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, హైదరాబాద్కు తాగునీటి సరఫరా కూడా మెరుగుపడేదని లేఖలో పేర్కొన్నారు. విజిలెన్స్ కమిషన్ నివేదిక, న్యాయమూర్తి పి.సి. ఘోష్ కమిషన్ నివేదికలపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని రామచందర్రావు ఆరోపించారు. విజిలెన్స్ నివేదికను బహిర్గతం చేసి, బాధ్యులపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో ప్రభుత్వం హైకోర్టులో సమర్థవంతంగా వాదించలేదని, సుప్రీంకోర్టులో అప్పీల్ కూడా చేయలేదని విమర్శించారు. కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దర్యాప్తు పరిధిని కేవలం మూడు బ్యారేజీల నిర్మాణ లోపాలకే పరిమితం చేసిందని రామచందర్రావు ఆరోపించారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం, పంప్ హౌస్లు, కాల్వలు, సొరంగాలు, జలాశయాలు, ఇతర నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందన్నారు. ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు మానేసి, కాళేశ్వరం జలాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రికి సూచించారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 13-07-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

## మనతో పాటు నడిచే వారు

కొందరంతే
అఖండ దీపంతా వెలుగుతూ జ్ఞాపకమై వెంట నడుస్తుంటారు.
గుండె గోడకు కొట్టిన మేకుకు ప్రతిఛాయా చిత్రాలై
వేలాడుతుంటారు.
కొందరి పేర్లు కూడ గుర్తుండవు వాళ్లు నేర్పిన అక్షరాలు
మాత్రం గుర్తుంటాయి.
పెదవుల పై విరబూసిన చిరునవ్వు.
మాటల్లో పలికిన అమృతధార వాళ్ళ నడకను అనుసరించిన స్మృతులు
మేఘాల్లో చటుక్కున మెరిసిన మెరుపులై
తళుక్కునే కళ్ళముందు మెదలి మాయమౌతుంటారు..
చాలా మంది
కొందరు ఆపరిచితులై కూడా మనసు తెరపై
అమాంతం ప్రత్యక్షమై
మరు నిమిషంలో అంతర్ధధానం.
మిట్ట మద్యాహ్నం .
వీపుకు చురకలంటించిన సూర్యుడు
వున్న ఫళంగా మేఘాల చాటుకెళ్లి చప్పున ఆకాశంలో
రోడ్డు పైకి వచ్చేసినట్టు
ఏదో బ్రేకు లేని వారి వాహనం
నడుస్తున్న మన పక్క నుండి
సర్రున వెళ్ళిపోయినట్టు
స్వాతి వానలా కురిసి ఆగి
పోతుంటారు.
కొందరు మాత్రం చిన్నప్పటి చెరువు ఈతలో
దోసిలిలో చిక్కి జారిపోయిన చేప పిల్లల్లా
గుర్తుకొచ్చినట్టే వచ్చి నిమేషంలో తెర చాటు కెళ్ళిపోతుంటారు.
గుండెలపైన..
ఆడించి పెంచినవాళ్లు మాత్రం
ఎడారిలో నడుస్తున్నా
పున్నమి వెన్నెల రాత్రుల్లో
మన పక్కనే నడిచే
మన నీడలా మనసు తోటలో
మనతో పాటే
మసలుతుంటారు!
కష్టాల్లో నైనా , నష్టాల్లో నైనా
కన్నీటి కెరటాల్లో నైనా !

... ఈతకోట సుబ్బారావు
9440529785

## ముఖంలేని కవిత

కొన్ని పూలలాంటి పదాలేరుకొచ్చి
మాలకడుతూ కూర్చుంటానా?
ఎవడో తీర్చాల్సిన అప్పుకోసం
ఫోన్ చేస్తాడు
మాల పటపటమని తెగిపోతుంది
పదాలన్నీ పూలలా చెల్లా చెదురై
చేతిలోంచి జారిపోతాయి
అప్పటికే వాడినట్టున్న పూలపదాలను
కాస్త కన్నీళ్లతో తడిపి
దండల్లా అల్లే ప్రయత్నం చేస్తుంటానా?
నా రోగానికి మందుల సంగతేమిటని
మంచంలోంచి అమ్మఫోన్ చేస్తుంది
పిల్లల ఫీజుల సంగతేం చేశావని
ఇల్లాలు కన్నెర్ర చేసి చూస్తుంది
దండలోని దారం తెగి
అప్పటి దాకా అల్లిన ఊహలు
బంతిపూలలా పిగిలిపోయి రాలిపోతాయి
చేతులకంటిన భావ పరిమళం
కన్నీటి వాసనేస్తుంది
తెగిపోయిన దండలోని పదాలు
బాంబు దాడిలో తెగిపడ్డ
మాంసం ముక్కల్లా
వాక్యాలు ముక్కలై తెగిపడ్డ పేగుల్లా
పోగుపడతాయి
మొత్తానికి
శిరస్సుపోయి
అవయవాలు ఛిద్రమై
గుర్తుపట్టకుండా తయారైన
ముఖంలేని కవితొకటి
రోడ్డుమీద అనాథ శవంలా పడివుంటుంది
ఎవరూ గుర్తుపట్టని శవంమీద పడి
నేనొక్కడ్నే ఆత్మీయుడ్ని కోల్పోయిన అనాథలా
గుండెలు బాదుకుంటూ
విలపిస్తుంటాను

-చిత్తలూరి

# అస్తిత్వ, తాత్త్వికతల మేలు కలయిక: జె.పి. దాస్ రచనలు

**భారతీయ భాషలలో ఒరియా (ఒడిశా) భాషాసాహిత్యానికి పదిహేనవ శతాబ్దం నుండే ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఆ కాలంలోనే మహాభారతాన్ని ఒరియా భాషలో అందించి, ఆ సాహిత్యానికి గట్టి పునాది వేసిన 'ఆదికవి' సరళా దాస్, అలాగే గ్రామీణ ఒడిశాలో ప్రతి ఇంటికీ సాంస్కృతిక దీపంగా మారిన 'భాగవతం' అందించిన భాగవత శిఖరం జగన్నాథ దాస్ లతో ఒరియా అక్షర ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత పదిహేడవ శతాబ్దంలో శబ్ద చమత్కారాలతో, అద్భుతమైన ఛందస్సుతో 'వైదేహీశ విలాస్' వంటి కావ్యాలను సృష్టించిన కవిసమ్రాట్ ఉపేంద్ర భంజా ఒరియా శాస్త్రీయ కవిత్వాన్ని ఒక శిఖరానికి చేర్చారు.**

ఆధునిక యుగానికి, 'వ్యాసకవి' గా పిలవబడే ఫకీర్ మోహన్ సేనాపతి 'ఛ మాణ ఆట గుంట' (ఆరు ఎకరాల ఎనిమిది కుంటలు) నవల ద్వారా ఆధునిక ఒరియా నవలకు, కథకు పితామహుడిగా నిలిచారు. ఆ పరంపరలోనే కాన్హుచరణ్ మొహంతీ 'హా అన్న' వంటి నవలలతో మధ్యతరగతి జీవితాల వాస్తవాలను అక్షరబద్ధం చేస్తే, సురేంద్ర మొహంతీ ఒడిశా సామాజికరాజకీయ పరిస్థితులకు అద్దం పడుతూ చారిత్రక నవలలు రాశారు. ఒరియా సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకున్న గోపీనాథ్ మొహంతీ 'అమృతర సంతాన' వంటి రచనలతో అడవి బిడ్డల జీవితాలను, వారి వేదనను అత్యంత ప్రతిభావంతంగా చిత్రించారు.


ప్రేమానురాగాలతో, అభ్యుదయ ధోరణులతో ఆధునిక ఒరియా కవిత్వానికి దిక్సూచిగా నిలిచిన సచ్చి రౌత్రాయ్, లౌకికపౌరాణిక కోణాలలో స్త్రీవాద చైతన్యాన్ని రగిలించి జ్ఞానపీఠ్ అందుకున్న ప్రతిభా రాయ్, అలాగే ఒరియా మరియు ఆంగ్ల భాషలలో ఆధ్యాత్మిక, తాత్విక కథలను ప్రేరణాత్మకంగా సృజించి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మనోజ్ దాస్ వంటి ఎందరో మహానుభావులు ఒరియా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ఇంతటి సుదీర్ఘమైన, వైవిధ్యమైన, మరియు పౌరాణికసామాజిక సాహిత్య నేపథ్యంలో... జగన్నాథ ప్రసాద్ దాస్ (జె.పి. దాస్) ప్రవేశం సరికొత్త విప్లవానికి దారితీసింది. 20వ శతాబ్దపు ఒడిశాకు చెందిన గొప్ప విద్యావేత్త, నిఘంటుకారుడు అయిన శ్రీధర్ దాస్ గారి కుమారుడిగా ఏప్రిల్ 26,1936వ తేదీన పూరీలో జన్మించిన జె.పి. దాస్, ఉత్కళ మరియు అలహాబాద్ విశ్వవిద్యాలయాలలో చదువు ముగించుకుని, దేశంలోనే అత్యున్నతమైన భారతీయ పరిపాలనా సేవ(IAS) లో చేరారు. ఒక ఉన్నతాధికారిగా సమాజంలోని రకరకాల మనుషులను, ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలను ఆయన చాలా దగ్గరగా చూశారు. అయితే, సాహిత్య, సాంస్కృతిక ప్రపంచంలోకి బలవంతంగా ప్రవేశించడానికి తన ఉన్నత పదవి ఆడంబరాలను ఉపయోగించుకోవాలనే ప్రలోభాలను ఆయన విస్మరించారు. ఆ పదవికి ముందే విరమణ ప్రకటించి, పూర్తి సమయాన్ని రాయడానికే కేటాయించారు. తొమ్మిది కవితా సంకలనాలు, నాలుగు కథా సంపుటాలు, నాలుగు నాటకాలు, చారిత్రక నవలలు, పిల్లల కోసం కవితలు ఇలా ఆయన రాయని ప్రక్రియ లేదు.

తనకు ముందుతరపు దిగ్గజాలంతా ఒకవైపు పురాణ ప్రతీకలతో, మరొకవైపు భారీ సామాజిక ఇతివృత్తాలతో సాహిత్య సృజన చేస్తే, జె.పి. దాస్ శైలి మాత్రం వీరిందరి కంటే చాలా భిన్నంగా సాగింది. ఆయన సాహిత్యం పాఠకుడిని కష్టమైన పదాలతో ఇబ్బంది పెట్టదు. మిగిలిన వారు దేవుళ్ల గురించి, చారిత్రక నాయకుల గురించి చెబితే, జె.పి. దాస్ మాత్రం బస్సు కోసమో, రైలు కోసమో నిరీక్షిస్తున్న సామాన్యుడిని, లేదా కార్యాలయపు గదిలో ఒంటరిగా గడుపుతున్న ఒక సాధారణ గుమస్తాను చూపిస్తూ జీవితం గురించిన లోతైన నిజాలను చెబుతారు. ఆయన కవిత్వంలో పెద్ద పెద్ద అలంకారాలు ఉండవు, కానీ గుండెను తాకే అనుభూతి ఉంటుంది. ఒక చిన్న గది, ఒక పాత కుర్చీ, గోడ గడియారం చేసే టిక్ టిక్ శబ్దం... ఇవే ఆయనకు ప్రపంచంలోని అతి పెద్ద కవితా వస్తువులు.

జె.పి. దాస్ కవిత్వంలో సామాజిక స్పృహ పెద్ద పెద్ద నినాదాల రూపంలోనో, ఉపన్యాసాల రూపంలోనో కనిపించదు. ఆయన సమాజంలోని అసమానతలను, అణచివేతను చాలా బలంగా, ప్రభావవంతంగా చూపిస్తారు. ఆయన రాసిన 'ఆహ్నిక' కవితా సంపుటిలోని కవితలను చూస్తే, సమాజంలో మనిషి అనుభవించే ఒంటరితనాన్ని, అట్టడుగు వర్గాల నిస్సహాయతను తన తాజా ఊహలతో, ప్రశ్నించే తత్వంతో ఆవిష్కరించారు. ఈ కవితలకు 1992వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కానీ పురస్కారాన్ని ప్రకటించిన తర్వాత కొన్ని వ్యక్తిగత నిబద్ధతల వల్ల దానిని స్వీకరించలేదు. సమాజంలో మనిషి పడే బాధల వెనుక కేవలం విధి మాత్రమే కాదు, నైతికంగా పతనమవుతున్న సామాజిక వ్యవస్థ కూడా ఉందనే సత్యాన్ని ఆయన కవిత్వం నిరంతరం గుర్తుచేస్తుంది. గుర్తింపు కోసమో, ప్రజాదరణ కోసమో పాకులాడకుండా, కేవలం సృజన అందించే ఆనందం కోసమే ఆయన సాహిత్యంలో మునిగిపోయారు.

ఆయన కథలలో 'మాయా మృగ' సంపుటిలోని ముఖ్యమైన కథ "మాయా మృగ"ను ఒక ప్రామాణిక ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ కథలో ఆధునిక నగర జీవితంలో బతుకుతున్న ఒక మధ్యతరగతి దంపతుల మానసిక స్థితిని దాస్ అద్భుతంగా చిత్రించారు. భర్తకు ఉద్యోగంలో పదోన్నతులు, సమాజంలో పెద్ద హోదా, వాహనం, పెద్ద భవనం కావాలి. భార్యకు నవ్య పోకడలు, విలాసవంతమైన జీవితం కావాలి. రామాయణంలో సీతమ్మ మాయామృగాన్ని చూసి భ్రమపడి, సుఖవంతమైన పర్ణశాలను వదిలి కష్టాల పాలైనట్లే, ఈ కథలోని పాత్రలు కూడా సమాజం సృష్టించిన తళుకుబెళుకులనే నిజమైన సంతోషం అనుకుని పరిగెడుతుంటాయి. ఈ పరుగులో వారి మధ్య ఉండవలసిన ప్రేమానురాగాలు, ఆత్మీయతలు కరిగిపోతాయి. కథ ముగింపులో వారు తాము అనుకున్న లౌకిక విజయాలన్నింటినీ సాధిస్తారు కానీ, తీరా చూస్తే వారి జీవితంలో ఒక అగాధమైన శూన్యత, ఒంటరితనం మిగులుతాయి. చేతికి దొరికినట్లే దొరికి మాయమైపోయే ఆ 'మాయామృగం' మరేదో కాదు, ఆధునిక మనిషిని వెంటాడే అపరిమితమైన కోరికలే అని జె.పి.దాస్ ఇందులో ఎంతో చక్కగా విశ్లేషించారు. కథన శైలిలో అనవసరమైన వర్ణనలు లేకుండా, పాత్రల అంతర్గత సంభాషణల ద్వారానే ఈ తాత్విక సత్యాన్ని ఆయన ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుంది. ఆయన కథానికలు తరచూ సమాజ కపటత్వాన్ని ఎండగట్టే పదునైన వ్యంగ్యంతో నిండి ఉండేవి.


జేపీ దాస్

ఆయన రాసిన "బిఫోర్ ది సన్‌సెట్" (సూర్యాస్తమయ) మరియు "ది అండర్ డాగ్" (అంధకూప్) వంటి నాటకాలను ప్రస్తుత ఆధునిక సమాజానికి అన్వయిస్తే, అవి ఎంతటి సజీవ సత్యాలో అర్థమవుతుంది. నేటి అంతర్జాల యుగంలో, దృశ్య మాధ్యమాల మెప్పుకోళ్లు, అనుచరుల భ్రమల్లో బతుకుతున్న మనుషులకు 'సూర్యాస్తమయ' లోని దీపంకర్ పాత్ర అద్దం పడుతుంది. ప్రపంచానికి తనేంటో నిరూపించుకోవాలనే తాపత్రయంలో రాత్రింబవళ్లు కష్టపడి, ఉద్యోగ విరమణ దశకు (సూర్యాస్తమయానికి) వచ్చేసరికి, తనకంటూ ఏమీ మిగల్లేదనే భయం నేటి వ్యాపార ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తుంది. 1976లో జరిగిన ఈ నాటక ప్రదర్శనలో ప్రసిద్ధ నటుడు ఓం పురి కూడా భాగస్వామి కావడం విశేషం.

అలాగే 'ది అండర్ డాగ్' నాటకం నేటి రాజకీయ, సామాజిక శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అమాయకులను, బలహీనులను ఎలా వాడుకొని, ఆపై కరివేపాకులా తీసిపారేస్తున్నాయో చూపిస్తుంది. ఈ నాటకాలు రాసి దశాబ్దాలు గడిచినా, నేటి సమాజంలో మనుషుల స్వభావం, వ్యవస్థలోని క్రూరత్వం ఏమాత్రం మారలేదని, ఇవి నేటికీ సమకాలీన నాటకాలే అని నిరూపిస్తాయి.

ఆయన రాసిన చారిత్రక నవల 'దేశ, కాల, పాత్ర', పంతొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్థంలో వలస పాలనలోని ఒడిశా చరిత్రను అద్భుతంగా పునర్నిర్మించింది. ఈ పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించేటప్పుడు అనువాదకుడికి ఆయన ఇచ్చిన సంపూర్ణ స్వేచ్ఛ, అనువాద రంగం పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనం.

ఈ కాలంలో వస్తున్న వర్తమాన రచనలతో జగన్నాథ్ ప్రసాద్ దాస్ రచనలను పోల్చినప్పుడు ఒక స్పష్టమైన తేడా కనిపిస్తుంది. నేటి కాలంలో చాలా రచనలు కేవలం తక్షణ స్పందనలుగా, పైపైన ఆవేశాన్ని ప్రదర్శించేవిగా ఉంటున్నాయి. కానీ జె.పి.దాస్ రచనలలో ఒక శాశ్వతత్వం ఉంది. ఆయన ఏనాడూ చౌకబారు ప్రసిద్ధి కోసం రాయలేదు. వర్తమాన సాహిత్యంలో శిల్పానికి ప్రాధాన్యత పెరిగి వస్తువు పలచనవుతున్న వేళ, జె.పి. దాస్ సాహిత్యం వస్తువులోని తాత్విక గంభీరతను, శిల్పంలోని నిరాడంబరతను ఎలా సమన్వయం చేయాలో నేటి తరానికి నేర్పుతుంది.

జె.పి.దాస్ గొప్ప చిత్రకారుడు, కళా చరిత్రకారుడు (Art historian)కూడా. పూరీలోని రఘురాజ్‌పూర్ చిత్రకారులపైనా, తాళపత్ర లఘుచిత్రాల కళపైనా ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. ఒక కవికి దృశ్యకళలపై అవగాహన ఉన్నప్పుడు, ఆయన రాసే ప్రతి అక్షరంలోనూ ఒక అద్భుతమైన దృశ్యాత్మకత రూపుదిద్దుకుంటుంది. ఈ రకమైన బహుముఖ ప్రజ్ఞే ఆయన రచనలకు కాలాతీతమైన బలాన్ని ఇచ్చింది. మనిషి తన అస్తిత్వం కోసం పడే ఘర్షణను, దానికి కాలం మరియు మరణం అనే పరమార్థాన్ని జోడించి చూసే లోతైన ఆలోచనను ఆయన సాహిత్యం మనకు అందిస్తుంది.

2006లో ప్రతిష్ఠాత్మక 'సరస్వతీ సమ్మాన్' పురస్కారాన్ని అందుకున్న జగన్నాథ్ ప్రసాద్ దాస్,90 ఏళ్ల వయసులో ఈ జూన్ 3వ తేదీ బుధవారం రాత్రి భువనేశ్వర్‌లో ఆఖరి శ్వాస విడిచారు. తన మరణానంతరం భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల కోసం దానం చేసి, బతుకులోనే కాదు చావులోనూ తన తాత్వికతను నిరూపించుకున్నారు. పూర్వీకులు సృష్టించిన మహాసాహిత్య పరంపరను గౌరవిస్తూనే, ఆధునిక మానవుడి మనసు లోతుల్లోకి ప్రయాణించి, భారతీయ సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో సుసంపన్నం చేసిన అరుదైన బౌద్ధిక తేజం ఆయన అనడంలో ఎలాంటి సందేహం లేదు.

(ఒడియా సుప్రసిద్ధ సాహితీవేత్త జగన్నాథ్ ప్రసాద్ దాస్ గారికి ఘన నివాళి)


విల్సన్ రావు కొమ్మవరపు
89854 35515

# తప్పిపోయిన ఆత్మ

కథ

**అనువాద కథ**
**ఆంగ్లమూలం: హెక్టర్ హ్యూ మన్రో (సాకి)**
**అనువాదం: ఎలనాగ**



ఆ పాత చర్చి పైభాగాన, పిట్టగోడల మీద అక్కడక్కడ రాతి శిల్పాలున్నాయి. కొన్ని దేవతలవి, కొన్ని రాజులవి, మరికొన్ని క్రైస్తవ మతగురువులవి. దాదాపు అన్నీ ప్రశాంతతను, ఆత్మనిగ్రహాన్ని వెలయిస్తున్నాయి. కానీ ఉత్తరం దిక్కున కొంచెం దిగువన ఉన్న విగ్రహానికి కిరీటం, బిషప్ కుళ్లాయి, కాంతివలయం ... వీటిలో ఏదీ లేదు. దాని ముఖం బిగుసుకుపోయి నిరుత్సాహాన్ని వెలార్చుతోంది. "అది రాక్షసుని విగ్రహం అయివుండాలి," అన్నాయి దినమంతా ఆ పిట్టగోడల గట్లమీద కూర్చొని ఎండ కాగే పావురాలు. అవి లావుగా, నీలం కలిసిన బూడిదవర్ణంలో ఉన్నాయి. కానీ మతశిల్పాలకు సంబంధించిన శాస్త్రంలో నిష్ణాతురాలైన ముసలి కాకి, "అది తప్పిపోయిన ఆత్మ తాలూకుది," అని ప్రకటించింది. అంతటితో ఆ చర్చ అక్కడే ముగిసింది.

తియ్యని కంఠస్వరం కలిగిన ఒక చిన్నపిట్ట చలికాలపు స్థావరం కోసం బంజరుభూముల మీంచి ఎగురుతూ వచ్చి, ఒక చలికాలపు ఉదయాన ఆ చర్చి పైకప్పు మీదికి చేరుకుంది. అలసిన తన కాళ్ళను ఒక దేవతా విగ్రహపు రెక్క కింద గానీ, రాజవిగ్రహపు నిలువుటంగీ లోని మడతలలో గానీ మోపాలని ప్రయత్నించింది. కానీ లావు పావురాలు దాన్ని అక్కడినుండి తరిమి కొట్టాయి. అదే పనిగా గోల చేసే పిచ్చుకల గుంపేమో ఆ పిట్టను గట్టు మీద కూర్చోనివ్వలేదు. ఏ పక్షికీ అంతటి భావ తీవ్రతతో పాడగలిగే నైపుణ్యం ఉండదు అని అభిప్రాయపడ్డాయి ఆ పావురాలు, పిచ్చుకలు. ఆ విధంగా ఆ చిన్నపిట్ట వేరే చోటును వెతుక్కోవాల్సి వచ్చింది.

తప్పిపోయిన ఆత్మ తాలూకు విగ్రహం మాత్రమే ఆ పక్షికి ఆశ్రయమిచ్చింది. దానిమీద కూర్చోవడం పావురాలకు క్షేమకరం అనిపించలేదు. ఎందుకంటే, అది చాలా ముందుకు వంగి ఉంది. పైగా దాని ఎక్కువ భాగం నీడలో ఉంది. అది ఇతర శిల్పాలలాగా భక్తిని వెలయిస్తూ చేతులు మడుచుకోలేదు, ధిక్కారంతో మడుచుకుంది. ఆ చేతులు ఆ చిన్నపక్షి చక్కగా ఒదిగిపోయేందుకు అనువుగా ఉన్నాయి. అది ప్రతి సాయంత్రం ఎంతో నమ్మకంతో ఆ విగ్రహపు ఛాతీ మీదికి ఎగిరింది. ఆ ప్రతిమ కన్నులు మెలకువతో ఉండి కాపలా కాస్తున్నట్టు కనిపించాయి. ఆ ఒంటరి పక్షి తనను రక్షించే ఆ విగ్రహాన్ని చాలా ప్రేమించింది. అది పగటి వేళల్లో నీటిపైపుల మీద గానీ, లేక అటువంటిదాని మీద గానీ కూర్చొని, రాత్రివేళలో తనకు రక్షణనిస్తున్నందుకు గాను కృతజ్ఞతను వెలిబుచ్చుతూ తియ్యగా పాడింది. ఎందుకో గానీ దాని ముఖం రానురాను మెల్లమెల్లగా స్తబ్ధతనూ, విషాదాన్నీ కోల్పోయింది. ప్రతిరోజూ విసుగు నిండిన పగటివేళల్లో దాని పాట అలలు అలలుగా ఆ ఒంటరి విగ్రహాన్ని తాకింది. సాయంత్రాలలో చర్చిగంట మోగే సమయంలో గబ్బిలాలు బయటికి పోయినప్పుడు ఆ చిన్నిపక్షి మెరిసే తన కళ్లతో వచ్చి, జోలపాట లాంటి స్వరాలను పాడి, తనకోసం వేచివున్న ఆ విగ్రహపు చేతులలో ఒదిగిపోయింది. ఆ రోజులు ఆ విగ్రహానికి సంతోష దినాలు. చర్చిగంట ప్రతిరోజూ 'ఆనందం తర్వాత విషాదం' అనే వెటకారపు సందేశాన్ని ఇస్తున్నట్టుగా మోగింది.

మతగురువు ఇంట్లోని పనిమనుషులు ఆ చిన్నిపక్షిని చూసి దాని మధురమైన గానాన్ని ఆరాధించారు. కానీ "పాపం, దాని తియ్యని పాట చర్చి పైకప్పు మీది పిట్టగోడల మీద వృథాగా నినదిస్తోంది," అనుకున్నారు వాళ్లు. అందుకని దాన్ని పట్టుకుని, మతగురువు ఇంటి ముందర వెదురుబద్దల పంజరంలో పెట్టారు.

ఆ రాత్రి ఆ చిన్నపక్షి తన రోజువారీ దినచర్యను కోల్పోయింది. ఆ విగ్రహానికి ఒంటరితనం, చేదు అనుభవం మిగిలాయి. తన మిత్రుడిని ఏదైనా పిల్లి చంపిఉండవచ్చుననీ, లేదా ఏదైనా రాయి తగిలి గాయం అయిందేమోననీ, లేదా వేరేచోటుకు ఎగిరిపోయిందేమోననీ దిగులు పడింది. కానీ మరునాటి ఉదయాన గుండెతీపును కలిగిస్తూ కింది పంజరం నుండి తియ్యని పాట గాలిలో తేలివచ్చింది. ప్రతిరోజు మధ్యాహ్నం వేళ పావురాలు మగతతో జోగుతున్నప్పుడు, పిచ్చుకలు వీధిలోని నీటిగుంటలలో స్నానం చేస్తున్నప్పుడు తహతహ, నిరాశ నిండిన పాట కిందనుండి వినవచ్చింది. దాని ఆ గానానికి జవాబు లేకపోయింది.

ఆ విగ్రహం మునుపటికన్న ఎక్కువగా ముందుకు వంగిందని చెప్పుకున్నాయి పావురాలు.

ఒకరోజు పంజరం నుండి ఏ పాటా వినబడలేదు. ఆ చలికాలపు అత్యంత శీతలమైన రోజు అది. పావురాలు, పిచ్చుకలు ఆహారం దొరుకుతుందా అని ఆందోళనతో అన్నిచోట్లా వెతుకుతున్నాయి. ఆ చలికాలంలో వాటికి ఆహారం మరింత ఎక్కువగా అవసరం.

"మతగురువు గారి మనుషులు మనకోసం ఆహారమేదైనా నేల మీద వేశారా?" అని ఒక పావురం మరొక పావురాన్ని అడిగింది.

"చనిపోయిన ఒక చిన్న పక్షిని మాత్రమే వేశారు," అని జవాబిచ్చింది ఆ పావురం.

ఆ రాత్రి చర్చి పైకప్పు మీంచి గోడ కూలినట్టుగా ధ్వని వినిపించింది. విపరీతంగా కురిసిన మంచు వలన గోడలు బలహీనమై కూలుతున్నాయనీ, ఎన్నో చలికాలాలలో అటువంటి సంఘటనలను చూసిన అనుభవం తనకు ఉందనీ చెప్పింది ముసలి కాకి. మరునాడు ఉదయం తప్పిపోయిన ఆత్మ తాలూకు విగ్రహం విరిగిపోయి పైనుండి కిందకు కూలిపోయి, ధూళి కుప్ప మీద పడింది.

ఆ సంఘటనను కొంతసేపు చర్చించిన తర్వాత లావు పావురాలు ఇలా అనుకున్నాయి: "భలే, సిబ్బంది తప్పకుండా ఆ స్థానంలో ఒక మంచి దేవతా విగ్రహాన్ని పెడతారు."

'ఆనందం తర్వాత దుఃఖం,' అంటున్నట్టుగా చర్చి గంట మోగింది.


- ఎలనాగ 9866945424

# ఈ లోకం ప్రేమను ఎక్కడో పారేసుకుంది

ఈ మనుషుల్ని చూసి
ఒకసారి నవ్వు కుంటాను
ఎవర్నీ ఏమనాలో, ఎవర్నీ ఏమనకూడదో
చాలా సార్లు బాధపడుతాను

వీళ్లందరికీ ఇలా ఏమైందీ
కలిసి బతికిన వాళ్లే ఇలాఎందుకు మారిపోయారు

పరాయివాళ్లమీద ఫిర్యాదులేదు
దగ్గరివాళ్లమీద కోపంలేదు
ఉత్సవంలో కలిసిన వాళ్లందరుకూడా
చేయి కలుపకుండానే వెళ్లిపోతున్నారు

ఈ లోకం, ప్రేమను ఎక్కడో పారేసుకుంది
స్వప్నాలను, అడుగుల కింద తొక్కుకుంటూ వెళ్లిపోతుంది

మాద్చుకున్న ముఖాలను, నీటిమీద చూపిద్దామనుకుంటే,
రాళ్లు విసిరి, అలలులేపి, దృశ్యాన్ని చెరిపేశారు

చీకటైతే పడలేదు, దీపం వెలిగించిపెడదాం
అంతలోపే గాలివీస్తే, దీపం వెలగడం కష్టమవుతుంది

ఖాళీ వీధుల్లో నా అడ్రస్ ఎవరు చెపుతారు

నేను బతికేది బంగళాల్లో కాదు, విల్లాల్లో కాదు

రద్దీ చౌరస్తాలో అడగండీ
ఉదయాల్లో, సాయంత్రాల్లో, వెతకండీ

మనుషులకోసం, మాటలకోసం తపిస్తాను
నేను నిరీక్షించే, ఫుట్ పాత్ లు వాళ్లు చూపిస్తారు


ఆశారాజు
9392302245

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు,
రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## రాస్తూనే పోతా

రాయకుండా ఉండలేని తనమే
నా రచనకు ఊపిరి
నా కవిత్వానికి అవమానమే మానం ,ప్రాణం,
గానం.
తరతరాల, యుగయుగాల
ఈ నిచ్చెనమెట్ల వ్యవస్తే
నా అక్షరాలకు ప్రాణం పోసింది.
మనువుగాడి ఐదోవర్ణ సృష్టే
నా ప్రశ్న పుట్టుకకు నాంది.
రాయకుండా ఉండలేని తనమే
నా అక్షరాలకు పదును.
వ్యవస్థ నాపై అణచివేత కు
యుద్ధంగానే నా అక్షరాలు
అసమానతలు, వివక్షతలు
అవమానాలు, పేదరికపు ఆకలి బాధలు,
అంటరాని వెలివేతలే
నా అక్షరాల ప్రత్యామ్నాయ సూత్రాలు.
నాలోని రాయలేని అగ్నిజ్వాలల విముక్త
స్వరమే,
కుల, మతాల విషపు కోరలు పీకే
పూలే ,అంబేద్కర్, పెరియార్,
జాషువా, వేమన, దేశీయ మార్క్సిజమే, అంబేద్కరిజమే
నా అక్షర సత్య పథం.
నా జాతి సంకెళ్ల విముక్త నేత్రం నేను.
నా సామాజిక శాస్త్రం నేను.
రాయబడని చరితకు
రాసుకోలేని యుగ యుగాల
అబద్దాల వ్యవస్థలో
బతుకుతున్న బానిస
జీవన గానం నేను.
నా బతుకు గాయాల
యుద్ధ వనం నేను.
మహోద్యమ కవనం నేను.
వెలివేతల జ్వరం నేను.
నీ రాసుకున్న జీవిత కావ్యం,
నేను వేసుకున్న నవీన మార్గం
వచ్చేవరకు ప్రవహించే పెనుమంటల పోరు
జాతర నేను.
నది పుట్టిన గొంతుక నేను.
శతకోటి ప్రశ్నల అస్తిత్వాన్ని నేను.
అస్తిత్వ ప్రశ్నల నేను.
నా జాతి గాయాల తలపోత నేను
రేపటి తరాల ఉద్యమ చైతన్యం నేను.
నిప్పులలో కాలి కాలి
బిరుసెక్కిన ఉక్కును నేను.
ప్రజల హక్కును నేను.
తప్పుడు వ్యవస్థను
చెప్పులతో తరిమికొట్టే
ఆత్మగౌరవ పోరాటం నేను.
నిజాల నిప్పులు కణ కణ మండే దప్పు గుండెను
నేను.
గుండె దప్పును నేను.
రాయకుండా ఉండలేని ప్రతిఘటనా స్వరం
నేను.
వెట్టి బతుకుల
మట్టి మనిషిని నేను.
జీవన్వేదనల
సమర సంగీతాన్ని నేను.
మరో ప్రపంచపు
నిజ మనిషిని నేను.
రాయకుండా ఉండలేని
రణభేరిని నేను.
చెమట నెత్తురుల
సజీవ వాక్యం నేను.
ముళ్ళ కంచెలను పెకలించే
కుళ్ళు వ్యవస్థలకు దడ పుట్టించే
కులోన్మాదులకు, మతోన్మాదులకు
జ్వరం రప్పించే అగ్ని కెరటాల స్వరం నేను.
సముద్రపు హోరును నేను.
మీ సమస్త అధికారాలకు
అలజడి నేను.
మీ సర్వాహంకారాలకు
సమాధి నేను.
నేను రాయకుండా ఉండలేని
పెను ఉప్పెన నేను.
నేనొక్కడినే
అనేక గొంతుల సామూహిక
స్వర సునామీని నేను.
అసమానతల కట్టుకథల చరిత్రకు
నిప్పు పాదాల అగ్ని పర్వతాన్నినేను.
మూగబోయిన గొంతులకు,
కోల్పోయిన మానవ హక్కులకు ..
స్వేచ్ఛగానాన్ని నేను.
అంటరాని వాక్యమే అయితేనేం
అధికార, అహంకార, పీఠాలను
సుదూర తీరాలకు తరిమేసే
పెనుగాలుల అల్లకల్లోలాన్ని నేను.
రాయకుండా ఉండలేని
మనిషితనాన్ని నేను
రాస్తూనే ఉంటా
చీకటికి చితిపెట్టే సూర్య కిరణాలు నాలో ప్రజ్వరిల్లే వరకు.
రాస్తూనే ఉంటా
తరతరాల యుగ యగాల బానిసత్వం పోయే
వరకు.
అసలైన మానవుడు మొలకెత్తే వరకు.
రాయకుండా ఉండలేని
ఈ అసమానతల,
దుర్మార్గపు వ్యవస్థే నా చేత రాయిస్తుంది.
నేను రాస్తూనే ఉంటా
నాలో కవిత్వమై విరబూసే వరకు
విశ్వవ్యాప్తమయ్యే వరకు.
రాస్తునే పోతా
నా ఊపిరి ఆగిపోయే వరకు.
నేను రాస్తూనే ఉంటా.

శిఖా ఆకాష్
93815222247.



## రైతులకు కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లు వదలండి

- టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
- గొంగిడి సునీత మహేందర్ రెడ్డి
- మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు

**యాదాద్రి భువనగిరి జూలై 12 మహా** : సీఎం రేవంత్ రెడ్డి ఈగో అహంకారం మొండి పట్టుదలను వదులుకొని కన్నెపల్లి ప్రాజెక్టు నుంచి రైతులకు నీళ్లు వదలాలని మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోనూతనంగా బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి లతో కలిసి ప్రారంభించారు...ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సమావేశంలో ఆమె మాట్లాడుతూ కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులను వ్యతిరేకించడమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని ఆమె ఆరోపించారు.. కన్నెపల్లి ప్రాజెక్టు నుంచి రైతులకు నీళ్లు ఇవ్వవచ్చని సమస్త ఇంజనీరింగ్ లోకం చెపుతున్నా సీఎం రేవంత్ రెడ్డి తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా మొండిగా వ్యవహరిస్తున్నారని ఆమె దుయ్యపట్టారు..బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ను సందర్శించిన తర్వాత రాష్ట్ర ప్రజల్లో ఒక ఆలోచన మొదలైందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి అన్నారు రేవంత్ రెడ్డి సర్కార్కు చేతకాక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రైతులకు ఇబ్బందులు ఉన్న పట్టించుకోకుండా కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు వదలడం లేదని ఆయన అన్నారు... తక్కువ కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు... అనంతరం పార్టీ కార్యాలయంలోసర్ కార్యక్రమంపై ఆలేరు మండల బి ఎల్ ఏ ల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యాట శివ, మౌనిక, మాజీ మున్సిపల్ చైర్మన్ వసుపరి శంకరయ్య, మాజీ ఎంపీపీ కాసగల్ల అనసూయ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, కొలనుపాక, టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ నాయకులు బాలస్వామి, కర్రె అశోక్, హరినాథ్, రామ్ నరసయ్య, రాంప్రసాద్, వెంకటేష్లతో పాటు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు సీస మహేశ్వరి, జయ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణను స్వయంగా పరిశీలించిన కలెక్టర్

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధి లోని కొత్తవాడ, రామన్నపేట, బ్యాంక్ కాలని, ఖిలా వరంగల్ లోని శంభుని పేట, పడమర కోటలో ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ సర్వే (ఎస్ఐఆర్)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) పనితీరును పరిశీలించి, ఓటర్ల నుంచి దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని బి ఎల్ వోలకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయాలని, బీఎల్ఓలకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వైవి గణేష్, డిబిసిడిఓ పుష్పలత, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.




## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా మీసాల ప్రకాష్ ప్రమాణ స్వీకారం

**ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం లోని ఓ సిటీ క్లబ్ లో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా మీసాల ప్రకాష్ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు .ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కొండా దంపతుల విధేయుడుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కాలంగా కష్టపడ్డ సీనియర్ నేత మీసాల ప్రకాశ్ కు ఈ పదవి దక్కడం ఆనందంగా ఉందని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఇస్తామని చెప్పారు. ముఖ్యంగా రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, స్మశానవాటికల ప్రహరీలు, అండర్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నేరుగా అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొండా మురళీధర్ రావు నాయకత్వంలో వరంగల్ తూర్పును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో మీసాల ప్రకాశ్ కీలక పాత్ర పోషించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్, భోగేశ్వర ఆలయ చైర్మన్ బూర సురేష్, తాజా మాజీ కార్పొరేటర్లు కావటి కవిత, బస్వరాజు కుమారస్వామి, చింతాకుల అనిల్, సోమిశెట్టి ప్రవీణ్, ముస్కు మల్ల అరుణ సుధాకర్, బాలిన సురేష్, భోగి సువర్ణ, నాయకులు చిట్టి మల్ల రమేష్ బాబు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 339.59 కోట్ల రూపాయలతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





**యాదాద్రి భువనగిరి జూలై 12 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో స్టేజ్-1, ప్యాకేజ్-2/7లో భాగంగా రూ.339.59 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 109.3 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించే నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి-చిట్యాల నాలుగు లైన్ల రహదారి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, రహదారి పూర్తయితే జిల్లాలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది. అలాగే వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 358. 18 కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన



**యాదాద్రి భువనగిరి జూలై 12 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం వంగపల్లిలో హ్యామ్ ఫేజ్ 1, ప్యాకేజీ1లో భాగంగా 358.18 కోట్ల వ్యయంతో నిర్మించే 210 కి.మీ.,4 రోడ్ల, అభివృద్ధి పైలాన్ పనులకు ఆదివారం రాష్ట్ర రహదారులు మరియు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,పాలకుర్తి శాసన సభ్యులు యశస్విని రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, యమ్ ఎల్ సి నెల్లి కంటి సత్యం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడి ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, వ్యాపార వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రహదారుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా చూడడం జరిగింది . రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తూ మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మరిన్ని అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు, పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని, పేద విద్యార్థులు ఉన్నత స్థానం ఎదగడానికి ప్రభుత్వ పాఠశాలలో అనేక సదుపాయాలు ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి అధిగమించేలా అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు , ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



## ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి: కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్

- 66 మంది రోగులకు పరీక్షలు
- కార్డియాలజీ, న్యూరో, గ్యాస్ట్రో తదితర విభాగాల్లో సేవలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశాల మేరకు సిఎంఓ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగంగా ఆదివారం మెడికోవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైద్రాబాద్ వారిచే కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ మెడికల్ క్యాంప్ నందు కార్డియాలజీ న్యూరాలజీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు సేవలు అందించారు. ఈ సందర్భంగా సిఎంఓ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల ఉద్యోగుల సంక్షేమ విషయంలో ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ రెండవ ఆదివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను నిర్వహించుకుంటున్నామని ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులో హెల్త్ ఆఫీసర్ డి.లలిత, మెయిన్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్

కారేపల్లి, మహా: మండలంలో భాగ్యనగర్ తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన నాలుగు సీసీ రోడ్ల పనులను సర్పంచ్ భానోత్ హీరాలాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో భాగ్యనగర్ తండా సిసి రోడ్లకు ఈజీఎస్ నిధులు మంజూరు అయ్యాయి అని తెలిపారు. కాంట్రాక్టర్ సకాలంలో, నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు పూర్తిచేయాలని కోరారు. గ్రామ సమగ్రభివృద్ధి కోసం ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నట్టు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకోచ్చి అభివృద్ధి చేస్తాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భిక్కులాల్, వార్డ్ సభ్యులు అంకి, దేవి, నాగేశ్వరావు, కిషన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు



నాయక్, హనుమా, క్రిష్ణ, బాబు, గ్రామ పంచాయతి సిబ్బంది రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వలిగొండ జులై 12 మహా న్యూస్** వలిగొండ మండలంలోని నాగారంలో ఆదివారం జిల్లా కలెక్టర్ ప్రతి ఇంటిని కలియ తిరుగుతూ సర్వే ప్రక్రియనుపరిశీలించారు బయటి రాష్ట్రాల నుండి వచ్చిన వారు ఇక్కడ ఉన్న వారి వివరాలు ఎలా సేకరిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు ప్రతి ఫారంను జాగ్రత్తగా నింపాలి అన్నారు ఒక్కో టీం కి ఎన్ని ఇండ్లు ఇచ్చారు ఇప్పటివరకు ఎన్ని పూర్తి చేశారు అని అడుగు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ దశరథ తదితరులు పాల్గొన్నారు



## మంత్రిని కలిసిన నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం

**మహా వరంగల్;** నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఫోరం నాయకులు ఆదివారం హనుమకొండ రాంనగర్ లోని కొండా దంపతుల నివాసంలో మంత్రి కొండా సురేఖ ను మర్యాదపూర్వకంగా కలిసి నిరుపేద దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం చోటు కల్పించాలని కోరుతూ సంఘంలోని నిరుపేద దివ్యాంగుల లిస్టు అందించడం జరిగింది. అదేవిధంగా దేవాలయాల్లో అటవీ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని అంగన్ వాడి పోస్టులలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా జిల్లాలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని మంత్రికి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, రాష్ట్ర సహాయ కోశాధికారి బైల గోపి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బండారి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం అప్పాయిగూడెం పంచాయతీ బీక్యతండాకు చెందిన భాదవత్ రామ్లా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాముల కుటుంబానికి అండగా నిలవాలని వైరా ఎమ్మెల్యే తన అనుచరులకు సూచించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఎస్ఎన్ నాయక్ 100 కేజీల బియ్యం ను ఆదివారం వితరణ చేశారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎస్ఎన్ నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుగులోతు లచ్చిరాం, వాంకుడోత్ బద్రు, వాంకుడోత్ సంతోష్, భూక్యా రాములు, పాల్త్యా లక్ష్మణ్, దండు ఉదయ్, కన్నం శీను, గుగులోతు లక్మా తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల దుబ్బతండా గ్రామ పంచాయతీలో మేకలతండా గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలను సర్పంచ్ అంగోత్ మత్రు నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతి గదుల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, భోజన నాణ్యత, పాఠశాల పరిసరాలను పరిశీలించి వార్డెన్, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.



# ప్రజాసేవకే రాజకీయాల్లోకి

- **మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి రావడం జరిగిందని అందుకు జనసేన పార్టీలో చేరినట్లుగా మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెం చుంచుపల్లి మండల పరిధిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముందు జనసేన పార్టీ జిల్లా కార్యాలయంను ప్రారంభించి పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం కొత్తగూడెం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టి అమరవీరుల స్థూపానికి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ మాట్లాడుతూ తాను జనసేన పార్టీలోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొత్తగూడెంలోనే పుట్టి పెరిగిన నేను మీ మనిషిగా ప్రజా సేవ చేయడానికి ఈ పార్టీలో చేరినట్లుగా చెప్పారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కు ప్రజలకు ఏమీచేయాలో తెలిసిన నిబద్ధత కలిగిన నాయకుడని సిద్ధాంతాలు కలిగిన నాయకత్వంలో పని చేసేందుకు ముందుకు వచ్చినట్లుగా వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పెద్ద రాజకీయ శక్తిగా ఎదుగుతుందని తనకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలోని బిఆర్ఎస్ పార్టీ కానీ, ప్రస్తుత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కానీ ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. అందుకే ఓ బలమైన రాజకీయ పార్టీగా రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో అన్ని ఎన్నికల్లో పోటీ చేసే గెలిచి పైకి ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి మాట్లాడుతూ శ్రీరాముడు ఆశీస్సులతో జిల్లాలో సేవ చేసే భాగ్యం కలిగించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశిస్తే ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం నుండి పోటీ చేస్తానన్నారు. సామాజిక తెలంగాణ జనసేన పార్టీతోనే సాధ్యమని బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించిన పార్టీకి తాము మొదటగా ఉంటామని బారాస పార్టీ దళిత ముఖ్యమంత్రి వాగ్దానాల మాటలుగా మార్చమని ముఖ్యమంత్రి బీసీ అభ్యర్థి అయినప్పుడే తెలంగాణలో సామాజిక తెలంగాణ వస్తుందన్నారు. అనంతరం జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ రాం తాళ్ళూరి, జనసేన పార్టీ ఇంచార్జి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్, మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస రావు తదితరుల సమక్షంలో 200 మంది యువకులు మహిళలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాము యాదవ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, టీ.శ్రీనివాసరావు, సినీనటుడు తనీష్, హసీనా, జయశ్రీ, ఖమ్మం జిల్లా ఇన్చార్జి మిర్యాల రామకృష్ణ, నరేష్, సాదిక్, జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

**భైంసా మహా :** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతుందని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.ఆదివారం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ ఫారాలు అందించినట్టు చెప్పారు. వాటి స్వీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతుందని వివరించారు. తిరిగి తీసుకున్న ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 42 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. జిల్లా పరిధి కిందికి వచ్చే 23 మండలాల్లో 7 లక్షల 55 వేల ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో ప్రక్రియ కాస్త నెమ్మదిగా ఉందని, భైంసా పట్టణానికి సంబంధించి నిన్నటి సాయంత్రం వరకు 20 శాతం ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ పూర్తిచేసినట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా విభజించి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, బిఎల్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్ల ద్వారా ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో భాగంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పై సమగ్రంగా అవగాహన కల్పించారు. పలువురు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, వారి సందేహాలు నివృత్తి చేశారు. ప్రతి బిఎల్ఓ తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సహకారం అందించాలని తెలిపారు. అనంతరం కుంటాల, ముధోల్ మండలాల్లో పర్యటించారు.కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముధోల్ మండలంలోని తరోడ గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ఆన్ లైన్ జరుగుతున్న తీరును, రికార్డుల నమోదు ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు.ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. బిఎల్ఓ యాప్ లో వివరాలను తనిఖీ చేశారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు.



# ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుంది

**మందమర్రిలో ఉత్సాహంగా కుంగ్ ఫు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు**

మందమర్రి, మహా :ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని స్థానిక ఏఎస్ఐ మిలన్ కుమార్ అన్నారు. ఆదివారం మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో విద్యార్థులకు కుంగ్ ఫు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్, అసిస్టెంట్ మాస్టర్ హరికృష్ణ, మాస్టర్ జెట్టి కృష్ణ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే కుంగ్ ఫు వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని సొంతం చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆపద సమయంలో రక్షణకు, అనుకోని ఆపదలు వచ్చినప్పుడు తమను తాము రక్షించుకోవడానికి ఈ విద్య ఎంతో తోడ్పడుతుందని వారు వివరించారు. విద్యార్థులకు చదువులో నాలుగు గంటలు పడే శ్రమను, క్రీడల్లో చురుగ్గా ఉండే విద్యార్థులు కేవలం ఒక గంటలోనే అర్థం చేసుకోగలరు" అని, క్రీడలు విద్యార్థుల మేధస్సుకు ఎంతో అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ పోటి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎల్లో, గ్రీన్, మెరూన్ బెల్టులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాస్టర్లు రాజేష్, శ్రీనివాస్, టి. రవి, చందు, శ్రీనివాస్, శ్రీధర్, ప్రభాకర్, ఎంఎల్ రవి తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ఈనెల 26న శ్రీ గాంధారి ఖిల్లా మైసమ్మ బోనాల జాతర

**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం లోగల శ్రీ శ్రీ శ్రీ గాంధారి ఖిల్లా మైసమ్మ బోనాల జాతరను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు నాయకపోడ్ సేవాసంఘం జిల్లా అధ్యక్షులు పెద్ది భార్గవ్ , రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొమ్ముల బాపు, ఆలయ కమిటీ చైర్మన్ రొడ్డ రమేష్ , నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గంజి రాజన్న , జిల్లా జనరల్ సెక్రటరీ సంజీవ్, తుడుందెబ్బ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జెక శేఖర్, ఉపాధ్యక్షులు లౌడం రాజుకుమార్, బైరినేని లక్ష్మణ్, బద్ది శ్రీనివాస్, చేనేని ప్రదీప్, పూజారులు రమేష్ , శ్రీధర్ ,అనిల్ , రాజేష్ , లక్ష్మణ్ ,కూన లక్ష్మణ్ లు ఆదివారం తెలిపారు. జాతరను పురస్కరించుకొని నేడు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఆదివాసి సాంప్రదాయబద్ధంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సమీక్ష నిర్వహించిందని వెల్లడించారు.




# సిఆర్పిఎఫ్ క్యాంపస్ లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్

**డిఐజిపి డాక్టర్ బి వీర్రాజు.**

**కుషాయిగూడ,మహా :** సిఆర్పిఎఫ్ క్యాంపస్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కు ఎంపికైందని నిరుద్యోగ యువతీ యువకులకు చక్కటి అవకాశం అని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిఆర్పిఎఫ్ డిఐజిపి డాక్టర్ బి. వీర్రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఇంటర్ మధ్యలో చదువు ను ఆపేసిన వారికి సువర్ణ అవకాశమని దూరవిద్య ద్వారా చదువును కొనసాగించవచ్చు అని తెలిపారు. బిఎ, బీకాం, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సులు ఏర్పాటు చేశారన్నారు. స్టడీ సెంటర్ కు కోఆర్డినేటర్ గా సిఆర్పిఎఫ్ వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్ ను నియమించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 31 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సిఆర్పిఎఫ్ గ్రూప్ సెంటర్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారిని సంప్రదించాలని కోరారు.

# రాష్ట్రంలో పరిపాలన 'చెత్త సినిమా'లా ఉంది

- **రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసైనా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి**
- **మాజీ మంత్రి పువ్వాడ ఘాటు విమర్శ**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పరిపాలన ఒక చెత్త సినిమాను తలపిస్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అశ్వాపురంలోని నూతన బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. రేవంత్ సర్కారుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక లేదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ లో రైతుల సమస్యలకు పరిష్కారం ఏంటని అడిగితే ప్రతి పక్ష నాయకుల రక్తం పారిస్తామనడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్తపిపాసి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. "రైతులకు నీళ్లివ్వడానికి మా రక్తమే అడ్డమైతే ఆ రక్తాన్ని ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. పాపం పండిన నాడు హిట్లర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుంది" అని హెచ్చరించారు. ఎందరో ముఖ్యమంత్రులను చూశామని కానీ ఇంతటి నోటిదూల ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు.

**రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసైనా సోయి తెచ్చుకో..**

మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసినా సీఎం రేవంత్ రెడ్డికి సోయి లేకపోవడం విచారకరమన్నారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీరు ప్రవహిస్తోందని కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చని గుర్తు చేశారు. మరో 100 రోజుల పాటు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుందని రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఇదే మేడిగడ్డ నుండి భద్రాచలం వరకు 25 లక్షల క్యూసెక్కుల నీళ్లు తెచ్చామని అప్పుడు కొట్టుకుపోని భద్రాచలం ఇప్పుడు లక్ష క్యూసెక్కులు కూడా లేకపోయినా మునిగిపోతుందని తప్పుడు ప్రచారం చేయడం విచారకరమన్నారు. కాళేశ్వరం నీళ్లు వస్తే ఎక్కడ కేసీఆర్ గొప్పతనం ఒప్పుకోవాల్సి వస్తుందో అని అనేక అబద్ధాలు చెప్పి దాన్ని పండబెడుతున్నారని మండిపడ్డారు. మన పీకల మీద కడుతున్న పోలవరం పూర్తి అయితే భద్రాచలానికి ముప్పు వస్తుంది తప్ప మేడిగడ్డ వల్ల కాదని స్పష్టం చేశారు.

**హామీల అమలు ఏమైంది?**

ఎన్నికల సమయంలో దేవుడి సాక్షిగా, భద్రాద్రి శ్రీ సీతా రామచంద్ర స్వామి మీద ఆన అని చెప్పిన హామీలను రేవంత్ రెడ్డి గాలికొదిలేశారని పువ్వాడ విమర్శించారు. యూరియా దొరకడం లేదని రైతులు రోడ్డెక్కితే వారు అసలు రైతులే కాదనడం హాస్యాస్పదమన్నారు. డిసెంబర్ 9 నాడే రుణమాఫీ చేస్తామన్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు ఆ ముచ్చటే గుర్తులేదన్నారు. గతంలో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కేవలం ఒకట్రెండు ఎకరాలకు మాత్రమే ఇచ్చి తర్వాత జాడే లేకుండా చేశారని దుయ్యబట్టారు. అత్తా కోడళ్లకు ఇస్తామన్న మహిళల డబ్బులు ఏమయ్యాయని, పినపాక నియోజకవర్గంలో ఎవరికైనా ఆ డబ్బులు అందుతున్నాయా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల పట్ల జాబ్ క్యాలెండర్ మోసపూరితంగా మారిందని, ఫీజు రీఇంబర్స్‌మెంట్ అందక విద్యార్థుల జీవితాలు దారుణంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌కు డిస్కమ్‌ల లింక్ పెట్టి దానిని ఎత్తివేయడానికి కుయుక్తులు పన్నుతున్నారని, తెలంగాణ రాకముందు కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు, బీఆర్ఎస్ హయాంలో అద్భుత విద్యుత్ సరఫరాను ప్రజలు గమనించారని గుర్తుచేశారు.

**అభివృద్ధి పడకేసింది..**

బీఆర్ఎస్ హయాంలో పినపాక నియోజకవర్గంలో బీటీపీఎస్ ఫ్యాక్టరీ, మున్సిపల్ అభివృద్ధి, కలెక్టరేట్ల అభివృద్ధిని వేగవంతం చేశామని పువ్వాడ తెలిపారు. కానీ తాము దిగిపోయేటప్పుడు సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులు ఎక్కడ ఉన్నాయో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 30 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అక్కడే ఉన్నాయని పాలమూరు ప్రాజెక్టు పరిస్థితి కూడా దారుణంగా తయారైందని ఎద్దేవా చేశారు. ఇక్కడి నీళ్లను ఇతర ప్రాంతాలకు తీసుకుపోవడానికి చూపిస్తున్న ఉత్సాహం స్థానిక చెరువులు నింపడానికి మంత్రులు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.

**రాజీలేని పోరాటాలు చేస్తాం..**

సింగరేణిలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై పార్టీ పరంగా పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడించారు. కాంగ్రెస్ చేసే విమర్శలకు బీఆర్ఎస్ పార్టీ భయపడి ముడుచుకు కూర్చోదని మరింత ఘాటుగా స్పందిస్తూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది

- **తాండూరు మండలంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**బెల్లంపల్లి,మహా**:ప్రజాస్వామ్యానికి ఓటే బలం, ప్రతి అర్హుడి ఓటు హక్కు సురక్షితంగా ఉండాలనే సంకల్పంతో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తాండూర్‌లో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ సర్వేలో ఆదివారం నాడు స్వయంగా పాల్గొన్నారు. ప్రజల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను తెలుసుకుని, తన స్వహస్తాలతో ఫారమ్‌లను నింపుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనది. ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించడం మనందరి బాధ్యత" అని అన్నారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించిన అక్కడ నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో నివారణ చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచిస్తూ, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజల మధ్యే ఉంటూ వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఎంపీ వంశీకృష్ణ ప్రకటించారు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా సాగాలని అధికారులకు సూచించారు.

# అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్**
- **ఆచార్య డాక్టర్ మద్దెల నేతృత్వంలో మంత్రి కార్యక్రమం విజయవంతం:**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భారతరత్న అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం మంత్రి గడ్డం వివేక్ భద్రాచలానికి ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కావడానికి వెళ్తూ మార్గమధ్యంలో తనకు అత్యంత సన్నిహితుడైన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ విజ్ఞప్తి మేరకు కొత్తగూడెంలోని అంబేద్కర్ సెంటర్(హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్) వద్ద తన కాన్వాయిని ఆపారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ ని ఘనంగా స్వాగతించి పూలమాలలు బొకేలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం సర్కిల్లో గల అంబేద్కర్ విగ్రహానికి మంత్రి వివేక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తర్వాత మంత్రి వివేక్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసి వ్యక్తి అంబేద్కర్ అన్నారు. తన అపరిమిత మేదస్సుతో భారత రాజ్యాంగాన్ని రచించి అందులో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు మహిళలు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు కూడా రిజర్వేషన్లను కల్పించి దేశంలో సమైక్యతను సమగ్రతను పరిరక్షించిన భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతో పాటు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ బాట జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పల్లా జాన్ రాజశేఖర్, సర్వయ్య, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు గౌరవ అధ్యక్షులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, అపరబాలు అల్లి శంకర్, చిత్రపురి సొసైటీ కార్యదర్శి సినీ నటులు తాండూరు ధనరాజ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కొప్పురి నవతన్, రాష్ట్ర మైనారిటీ నాయకులు సల్మాన్ తోత, మహమ్మద్ రఫీ, సంఘ నాయకులు భూపతి అశోక్, అడ్వకేట్ రమేష్ నాయక్, రఘునాథ్ బాబు, డాక్టర్ తమల జోసెఫ్, బొమ్మెర అశోక్, మచ్చ పృథ్వీరాజ్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాళ్లు బడికల పుష్పలత, జోగు రమాదేవి, కుంచె లావణ్య, మాధవిలత, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, సంఘ నాయకులు కేదాసి కిరణ్, చింటూ అఫ్రయిం, సుమన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంత్రి పర్యటనకు ఒకటవ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, మూడవ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తమ సిబ్బందితో పర్యవేక్షించారు.



# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం

**బసంతనగర్ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్**

బసంతనగర్ జూలై 12 మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బసంతనగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యాలయం వద్ద ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో 12 మంది వాలంటీర్ల సహాయంతో ఓటర్ల నమోదు, తప్పుల సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్ల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తు ఫారాలను సేకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పరిషవేణి శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్ కార్యక్రమం కొనసాగుతుందని, ఓటు హక్కు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఎ లు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికా స్థావరాలపై దాడులంటూ ఇరాన్ ప్రకటన.
- హర్మూజ్ జలసంధి మూసివేత ప్రకటించిన ఐఆర్జీసీ.

**టెహ్రాన్/వాషింగ్టన్,మహా :** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరోసారి తీవ్రమయ్యాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు జరిగాయని ఆరోపించిన ఇరాన్, దీనికి ప్రతీకార చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. జోర్డాన్, ఖతార్, ఒమన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు కూడా ప్రకటించింది.ఇరాన్ అధికారిక మీడియా సంస్థ ద్వారా విడుదల చేసిన ప్రకటనలో, తమ దక్షిణ తీర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిందని ఆరోపించింది. దీనికి ప్రతిస్పందనగా మూడు దశల్లో ప్రతీకార చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ వైమానిక స్థావరంపై దాడి చేసి కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంతో పాటు డ్రోన్ హ్యాంగర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది.
రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ వైమానిక స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ప్రకటించింది. కమాండ్ సెంటర్‌తో పాటు యుద్ధ దెబ్బతిన్నాయని పేర్కొంది. అనంతరం మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టు ప్రాంతంలో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని భారీ దాడులు చేసినట్లు వెల్లడించింది.అంతేకాకుండా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఈ దాడుల్లో రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వ కేంద్రాలు ధ్వంసమైనట్లు పేర్కొంది. తమపై మళ్లీ దాడులు జరిగితే మరింత తీవ్ర స్థాయిలో ప్రతీకార చర్యలు తప్పవని అమెరికాకు హెచ్చరికలు జారీ చేసింది.హర్మూజ్ జలసంధిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు దారితీసింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన ఈ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలను నిలిపివేస్తామని ప్రకటించడం అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపే అవకాశాలపై చర్చకు దారితీసింది. అమెరికా జోక్యం పూర్తిగా ఆగే వరకు హర్మూజ్ జలసంధి గుండా ఎలాంటి నౌకలను అనుమతించబోమని ఇరాన్ స్పష్టం చేసింది.అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మధ్యప్రాచ్య దేశాలు అప్రమత్తమవుతున్నాయి. తాజా పరిణామాలు ప్రాంతీయ భద్రతతో పాటు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై కూడా ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇరాన్ ప్రకటించిన దాడులు, వాటి ప్రభావంపై స్వతంత్ర ధృవీకరణ లేదా అమెరికా అదికారిక స్పందన కోసం అంతరాతీయ సాయిలో

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నేనున్నా: ఎమ్మెల్యే

- గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలి
- అర్హులందరికీ రెండో దప ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం జూలై 12 మహా:** మల్కీజ్ గూడ, అయ్యవారిగూడెం గ్రామాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులకు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, నియామక పత్రాలను అందజేశారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో ఆదివారం మల్కీస్ గూడ గ్రామ అధ్యక్షునిగా వరికుప్పల యాదయ్యను, అలాగే అయ్యవారిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా నక్క లక్ష్మయ్య యాదవును, ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో ఎన్నుకొని వారికి నియామక పత్రాలు ఆయన చేతులు మీదుగా అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే వారికి దిశా నిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ ప్రతిష్ట గురించి పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేసే నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని, అంతే కాకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేయాలని కోరారు. అధ్యక్ష కార్యదర్శులుగా నియామక పత్రాలు అందుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల వెంకటరెడ్డి, బిఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిల్లకంటి శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు దేంది రాంరెడ్డి, కేషమోని రాజు, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, వెంకట నరసింహా రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్, మాజీ ఉపసర్పంచ్ నక్క మహేందర్, గ్రామ నాయకులు గౌరారం



# రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదు

**సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**

**రాజేంద్రనగర్ మహా;** బహదూర్ గూడ రైతుల భూ పోరాటానికి సిపిఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మద్దతు తెలిపారు. బహదూర్ గూడలో రైతులు చేస్తున్న భూ పోరాటానికి సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతులను ఆదివారం కలిసి వారి భూ పోరాట ఉద్యమానికి సానుభూతి తెలిపారు.అయిన మాట్లాడుతూ విలువైన పేద రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటుంది. పేద రైతులను భయభ్రాంతులకు గురిచేసి సగానికి పైగా భూమిని తీసుకోవడానికి హైడ్రా, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. సర్వేనెంబర్ ఒకటి నుంచి 101 వరకు 1350 ఎకరాల రైతుల భూములు ఉన్నాయి. తాతల తండ్రుల కాలం నుంచి భూములను నమ్ముకుని సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. రికార్డులను తారుమారు చేసి ఒకటి నుంచి 76 వరకు రికార్డులనుఉంచారు. 77 నుంచి 101 వరకుఉన్న రికార్డులు తొలగించారు. సర్వే నెంబర్ 62 లో 12 ఎకరాలు, 28లో 5 ఎకరాలు ఉండాలి. కానీ ఉన్న రికార్డును తొలగించి, 62లో 500 ఎకరాలు, 28లో 150 ఎకరాలు భూములు ఉన్నట్టు భూ రికార్డులు సృష్టించారు. రికార్డులను తారుమారు చేసి రైతులను అయోమయానికి గురి చేస్తున్నారు. సగనికి పైగా భూమిని కాజేయడానికి ప్రభుత్వం అధికారులు కుట్రలు పన్నుతున్నారని రైతులు ఆరోపించారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో బహదూర్ గూడ రైతులకు పట్టాలు ఇస్తానని హామీఇచ్చారు. గెలిచాక రైతులకు పట్టా పాస్ బుక్కు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్త పరిచారు. బహదూర్ గూడా రైతులకు పట్టా పాస్ బుక్ లో వచ్చేవరకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పాల మాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, నల్లగిరి, కూమరి నరసింహ్మా, వెంకటేష్ గౌడ్, శేఖర్, మల్లేష్, ఐలయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.



# యువతను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..!

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి
- ఉద్యోగాల సాధనకై ఈనెల 15న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- ఈ మహాధర్నాకు డివైఎఫ్ఐ పూర్తి మద్దతు
- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్




**ఇబ్రహీంపట్నం జూలై 12 మహా:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకై నోటిఫికేషన్స్ వేయాలని, ఉద్యోగాల సాధనకై ఈ నెల 15 వ తేదిన సిపిఎం చేపట్టిన మహాధర్నాకు డివైఎఫ్ఐ మద్దతు తెలియజేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా యువత,నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు.
ఇబ్రహీంపట్నంలో ఆదివారం పాషా, నరహరి స్మారక కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య( డివైఎఫ్ఐ) ఇబ్రహీంపట్నం మండల మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ... 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తుందని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేని పాలక ప్రభుత్వ ప్రజాప్రతినిధులు యువతకు సమాధానం చెప్పాల్సింది పోయి, "పకోడీలు, బజ్జీలు వేయడం కూడా ఉద్యోగమే" అని వ్యాఖ్యానించడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు బీజేపీ నాయకులు కూడా ఇదే ధోరణిని కొనసాగించడం దేశ యువత ఆకాంక్షలను అవమానించడమేనని పేర్కొన్నారు.
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నప్పటికీ నియామకాలను ఎందుకు చేపట్టడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించనున్న ఏడు వేల ఎస్ఐ, కానిస్టేబుల్ పోలీస్ ఉద్యోగాలు సరిపోవని, ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్ (డియల్), డీఎస్సీతో పాటు అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి, దానికి అనుగుణంగా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
ఇప్పటికే టీజీపీఎస్సీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌లో సుమారు 30 లక్షలకు పైగా నిరుద్యోగులు నమోదు చేసుకున్నారని, వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 16 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేయగా, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో కలిపి మొత్తం 62 వేల ఉద్యోగాలే భర్తీ అయ్యాయని అన్నారు.లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, హాస్టళ్లలో ఉంటూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు.ఉద్యోగాల సాధనకై ఈ నెల 15న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే నిరుద్యోగ మహాధర్నాలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో డివైఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షులు గజ్జల మహేష్, బాల్ రాజ్, రమేష్, శ్రీకాంత్, సందీప్, సాయికుమార్, చరణ్, ప్రవీణ్, గణేష్, ఆనంద్, శివ, అనిల్, దాసు, యాదగిరి, రాజు, ప్రసాద్, విగ్నేష్, దానయ్య, వెంకటేష్, నరసింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# కంపుతో జనజీవనం అస్తవ్యస్తం

**కుషాయిగూడ, మహా :** కొట్లాడి తెచ్చిన తెలంగాణలో డంపింగ్ యార్డ్ ప్రాంతాల ప్రజలు కంపు భరించలేక జనజీవనం హస్తవ్యస్తమవుతుందని గాలి నీరు నేల పూర్తిగా విష తుల్యమవుతున్నా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం డంపింగ్ పై నోరు మెదప పోవడం సిగ్గుచేటని పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య దుయ్యబట్టారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక సాధన కమిటీ పిలుపులో భాగంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకురాలు పోరాట కమిటీ కో కన్వీనర్ అనురాధ ఆధ్వర్యంలో ఆదివారం జవహర్ నగర్ లోని గిరిప్రసాద్ నగర్ లో పాదయాత్రల తో ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంధ్య హాజరై మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ప్రాంతాల్లోని 100 బస్తీల ప్రజల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించి డంపింగ్ యార్డ్ ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలతో కాలనీలో ఇంటింటికి తిరుగుతూ డంపింగ్ భూతంపై ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ఈనెల 26న శాస్త్రవేత్తలతో జరిగే భారీ ప్రజా అవగాహన సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, మేక లలిత యాదవ్, అంబికా, స్వరూప, సరిత జ్యోతి, మీరా, అరుణక్క, శ్రీదేవి, ఎర్రెల్లి మల్లేష్ జయక్క చంద్రమౌళి సావిత్రి, సుబ్రహ్మణ్యం పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 19 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

**హిమాయత్‌నగర్ బాధితులకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంఘీభావం**

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తన చేతుల మీదుగా 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశామని, అయితే ఇప్పటికీ వారికి స్థలాల స్వాధీనం (పొజిషన్) కల్పించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాను అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు.
గత 17 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన హిమాయత్‌నగర్ గ్రామస్థులకు ఆదివారం ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం సరైన విధానం కాదని విమర్శించారు.పేదలకు ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకోవడం అన్యాయమని, బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో పలువురు పెద్దలు వ్యవసాయ క్షేత్రాలు సాగు చేస్తున్నారని, ముందుగా అలాంటి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
హిమాయత్‌నగర్ 60 గజాల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే, భవిష్యత్తులో కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ కరోళ్ల శ్రీధర్, 3వ వార్డు కౌన్సిలర్ బిలపాటి కవితఎల్లేష్, రాష్ట్ర నాయకులు దేశమల్ల ఆంజనేయులు, కొంపల్లి అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, దప్పు రాజు, మాజీ సర్పంచ్ ముదిగొండ మంజులరవి యాదవ్, మాజీ ఉప సర్పంచ్ షాబాద్ శ్యాంరావు, చిడిగిద్ది కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకుడు సలీం ఖాన్, పాటి ప్రసాద్ రెడ్డి, మాల స్వామి, జల్లెల మల్లేష్ యాదవ్, వడ్ల కాళిదాస్ చారి, పరమేష్, మోత్కుపల్లి సునీల్, కిరణ్, హిమాయత్‌నగర్ యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను, కరీం, గోపాల్ నాయక్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు

# ఎన్నిమరేషన్ ఫారం సమర్పించకపోతే ఓటు తొలగించబడుతుంది.!

- ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో తప్పనిసరిగా సమర్పించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఫారం సమర్పించకపోతే భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడుతుందని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి, ఐఏఎస్ తో కలిసి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని గుల్మోహర్ పార్క్ కాలనీ, మై హోమ్ మంగళ గేటెడ్ కమ్యూనిటీ, ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని శ్రీ సాయిరాం కాలనీ (బీఎన్ రెడ్డి), సాహెబ్‌నగర్ కళ్యాణ మండపంలను సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్వోలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్వోలు), బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారాలను పూర్తిగా నింపించి నిర్దేశిత గడువులోగా తిరిగి స్వీకరించేలా విస్తృత ప్రజా అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, అందిన ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి నిర్దేశిత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓ) తప్పనిసరిగా సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ స్పష్టం చేశారు.
ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడం, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడమే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, ఆన్‌లైన్ డిజిటైజేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకతతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించేలా సమగ్రంగా ఎన్యూమరేషన్ నిర్వహించాలని సూచించారు. అలాగే, ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని జిల్లాలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా విస్తృత చర్యలు చేపట్టామని, పంపిణీ చేసిన ఫారాలను పూర్తి వివరాలతో నింపి నిర్దేశిత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓ) తప్పనిసరిగా సమర్పించాలని ప్రజలను కోరారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, అందిన ఎన్యూమరేషన్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి డిజిటైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా సమగ్రంగా ఎన్యూమరేషన్ నిర్వహించాలని సూచించారు. అలాగే, ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని పక్షంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో సంబంధిత జోనల్ కమిషనర్లు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్వోలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్వోలు), బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.



# రాజమౌళి సినిమాలో ఎన్టీఆర్ తనయుడు..

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్‌బాబు హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ యాక్షన్ చిత్రానికి సంబంధించిన ప్రతి వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా మరో ఆసక్తికర ప్రచారం సినీ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.

సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం.. జూనియర్ ఎన్టీఆర్ చిన్న కుమారుడు భార్గవ్ రామ్ ఈ సినిమాతో సినీ అరంగేట్రం చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. మహేష్‌బాబు పోషిస్తున్న 'రుద్ర'** పాత్ర చిన్ననాటి పాత్రలో భార్గవ్ రామ్ కనిపించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. రాజమౌళి సినిమాల్లో చిన్ననాటి పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో ఈ వార్త మరింత వేగంగా వైరల్ అవుతోంది.

ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే.. మహేష్ బాబు సినిమాలో ఎన్టీఆర్ తనయుడి ఎంట్రీ అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. రాజమౌళి-ఎన్టీఆర్ మధ్య ఉన్న సాన్నిహిత్యం, అలాగే మహేష్ బాబు-ఎన్టీఆర్ స్నేహబంధం కూడా ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

అయితే ఈ వార్తలపై చిత్రబృందం గానీ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల అధికారిక ధృవీకరణ వచ్చే వరకు దీనిని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాలి.

ఇక మహేష్ బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతుండటంతో, దీనికి సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా అభిమానుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.






# సంక్రాంతి బరిలో రవితేజ–శ్రీవిష్ణు?

టాలీవుడ్‌లో వచ్చే ఏడాది సంక్రాంతి పోటీ మరింత ఆసక్తికరంగా మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. మాస్ మహారాజా రవితేజ, యువ హీరో శ్రీవిష్ణు ప్రధాన పాత్రల్లో దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు ఫిల్మ్‌నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి.

సమాచారం ప్రకారం.. ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభమై, దాదాపు 150 రోజుల పాటు నిరవధికంగా కొనసాగనుంది. చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి పండుగ సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి 'వీరాధివీరులు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికే సంక్రాంతి బరిలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో విడుదల తేదీల విషయంలో ఎలాంటి అపోహలు తలెత్తకుండా ఉండేందుకు నిర్మాతలు దిల్ రాజు, శిరీష్‌లు తమ విడుదల ప్రణాళికపై అనిల్ రావిపూడికి ముందుగానే సమాచారం ఇచ్చినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

అయితే రవితేజ-శ్రీవిష్ణు మల్టీస్టారర్ షూటింగ్ షెడ్యూల్, 'వీరాధివీరులు' టైటిల్, సంక్రాంతి విడుదలకు సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి ఈ విషయాలను ప్రస్తుతానికి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాలి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.



# నాని నిర్మాణంలో నితిన్ సినిమా?

- **మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రచారం**
- **హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ పేరు వినిపిస్తున్న టాలీవుడ్ వర్గాలు**

టాలీవుడ్ హీరో నితిన్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న నితిన్, కొత్త దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వంలో విభిన్న కథతో రూపొందనున్న చిత్రంలో నటించనున్నట్లు సమాచారం.

ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు, ఈ చిత్రానికి ప్రముఖ హీరో నాని నిర్మాతగా వ్యవహరించనున్నారనే వార్తలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.నిర్మాతగా ఇప్పటికే విభిన్న కథలను ప్రోత్సహిస్తున్న నాని, తన నిర్మాణ సంస్థ ద్వారా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను తీసుకురావాలని భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నాని నిర్మాణంలో నితిన్ హీరోగా సినిమా తెరకెక్కితే అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇక రుక్మిణి వసంత్ దక్షిణాది చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంటుండగా, ఆమె నితిన్ సరసన నటిస్తే ఈ జోడీ కొత్త ఆకర్షణగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ కూడా కథకు ప్రాధాన్యమున్న సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం.

అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి ప్రస్తుతం వినిపిస్తున్న వివరాలను సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాలి. త్వరలోనే ఈ చిత్రంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.





# వర్షంలో ప్రిషా అందాల విందు

టి ప్రిషా సింగ్ మరోసారి తన అద్భుతమైన ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంది. నలుపు రంగు ఆధునిక శైలిలో రూపొందించిన చీరతో పాటు స్టైలిష్ క్రాప్‌టాప్, పారదర్శకమైన పూర్తి చేతుల డిజైన్‌తో ఆమె కనిపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వర్షపు జల్లులతో తడిసిన నగర వాతావరణంలో ప్రశాంతంగా కళ్లుమూసుకుని, చేతులు చాచి నిలిచిన ఆమె భంగిమ ఫోటోకు కళాత్మక అందాన్ని తీసుకొచ్చింది. మబ్బులతో కమ్ముకున్న నేపథ్యం, సహజమైన వెలుతురు, ప్రిషా సింగ్ ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు కలిసి ఈ చిత్రాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఆమె సహజ సౌందర్యం, ఫిట్‌నెస్, హుందాతనం, భావవ్యక్తీకరణ ఈ ఫోటోషూట్‌లో ప్రత్యేకంగా మెరిసిపోయాయి.

ప్రిషా సింగ్ సినీ ప్రయాణం 2020లో ప్రముఖ దర్శకుడు షూజిత్ సిర్కార్ తెరకెక్కించిన హిందీ చిత్రం **'గులాబో సితాబో'**తో ప్రారంభమైంది. అమితాబ్ బచ్చన్ వంటి దిగ్గజ నటుడితో కలిసి తెరపై కనిపించే అవకాశం దక్కడం ఆమె కెరీర్‌కు మంచి ప్రారంభంగా నిలిచింది. చిన్న పాత్రలో కనిపించినప్పటికీ తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ప్రిషా, అదే సమయంలో నటిగా మరింత ఎదగాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది.

తెలుగు సినీ పరిశ్రమలోకి ఆమె అడుగుపెట్టింది 2023లో విడుదలైన యాక్షన్ థ్రిల్లర్ 'స్పై' చిత్రంతో. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన ఈ సినిమాలో రెహ్మాన్ కుమార్తె పాత్రలో ప్రిషా సింగ్ కనిపించింది. పరిమిత స్క్రీన్ టైమ్ ఉన్నప్పటికీ తన సహజ నటన, ఆకట్టుకునే అభినయంతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రేక్షకులకు ఆమె పేరు పరిచయం కావడంలో ఈ చిత్రం కీలక పాత్ర పోషించింది.

ఆ తర్వాత 2024లో విడుదలైన ఫాంటసీ యాక్షన్ కామెడీ 'బడ్డీ' చిత్రంతో ప్రిషా సింగ్‌కు మరింత గుర్తింపు వచ్చింది. అల్లు శిరీష్ హీరోగా నటించిన ఈ సినిమాలో ఎయిర్ హోస్టెస్ పాత్రలో ఆమె కనిపించింది. కథలో కీలకమైన పాత్రను సహజంగా, నమ్మకంగా పోషించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్లామర్‌తో పాటు నటనకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తానని ఆమె మరోసారి నిరూపించింది.

ప్రిషా సింగ్ ప్రస్తుతం హిందీ, తెలుగు భాషల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకునే దిశగా ముందుకెళ్తోంది. ప్రతి చిత్రంలో కొత్తదనాన్ని చూపించాలని, విభిన్నమైన పాత్రలను ఎంచుకోవాలని ఆమె చూపుతున్న ఆసక్తి సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. అందం మాత్రమే కాకుండా కష్టపడే స్వభావం, పాత్రపై నిబద్ధత, కెమెరా ముందు సహజమైన నటన ఆమెను యువ కథానాయికల్లో ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

చిన్న పాత్రతో ప్రారంభమైన ఆమె ప్రయాణం ఇప్పుడు ప్రధాన పాత్రల వరకు చేరుకోవడం వెనుక పట్టుదల, క్రమశిక్షణ, ప్రతిభ ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావాలని ప్రిషా సింగ్ ప్రయత్నిస్తోంది. తన అందం, అభినయం, తెరపై హుందాతనంతో భారతీయ సినీ పరిశ్రమలో మరింత ఎత్తుకు ఎదిగే సామర్థ్యం ఉన్న యువ కథానాయికగా ఆమెపై సినీ అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com